ఎందరో మహానుభావుల త్యాగం స్వాతంత్ర్యం



బలగం TV
BALAGAM
నిజమే మా బలం..ప్రజలే మా బలగం

BALAGAM TV DIGTAL NEWS PAPER/ balagamtv100@gmail.com

హైదరాబాద్ ఆదివారం, 16 ఆగస్టు-2026 | balagamtv100@gmail.com | పేజీలు-8



# కృష్ణా-గోదావరి జలాల్లో రాజీపడే ప్రసక్తే లేదు

- సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోంది
- 31 నెలల కృషి ఫలితాలు ఇప్పుడిప్పుడే కనిపిస్తున్నాయి
- తలసరి ఆదాయంలో టాప్‌లో ఉన్నాం
- రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటదన్న నమ్మకం
- అధికారంలోకి రాగానే 2లక్షల రుణామాఫీ చేపట్టాం
- గోల్కొండలో జెండా ఎగరేసిన సిఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్,ఆగస్ట్15 : తెలంగాణ నీటి హక్కుల విషయంలో రాజీ పడేది లేదని, పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేసి రైతుల కళ్లలో ఆనందం చూస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. గోల్కొండ కోటలో నిర్వహించిన స్వాతంత్య్ర వేడకలకు సీఎం ముఖ్యఅతిథిగా హాజరై జాతీయపతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. విద్య, వైద్యం.. ఈ ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్య అంశాలని తెలిపారు.సంక్షేమం కోసం కృషి చేస్తున్న ప్రభుత్వం తమది అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. 80వ స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని గోల్కొండ కోటపై సీఎం జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తూ.. మిగతా 3లో..

# భారత్‌కు ప్రపంచస్థాయి నాయకత్వ లక్షణం





- అన్ని రంగాల్లో దూసుకు పోయే తత్వం
- సత్తా చాటగల నైపుణ్యాలు మన సొంతం
- యువత ఓ గంట సమయం కేటాయిస్తే చాలు
- జనగణనలో ఖచ్చితమైన సమాచారం ఇవ్వండి
- దానితోనే దేశ అభివృద్ధి ప్రణాళికలు రచించగలం
- ఎర్రకోట నుంచి ప్రధాని మోడీ పిలుపు
- ఎర్రకోట వేడుకలకు దూరంగా రాహుల్, ఖర్గే

దేశవ్యాప్తంగా 80వ స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. రాజధాని దిల్లీలో ఎర్రకోటపై ప్రధాని మోదీ జాతీయ జెండా ఎగురవేశారు. దిల్లీలోని ఎర్రకోటపై మోదీ వరుసగా 13వ సారి జాతీయ జెండా ఎగురవేశారు. దేశ చరి త్రలో తొలిసారిగా వందేమాతరం గేయాన్ని పూర్తిగా ఈ వేడుకల్లో ఆలపించారు. అనంతరం జాతీయ గీతం'జనగణ మన'ను ఆలపించారు. ఆ సమ యం లోవాయుసేన పూలవర్షం కురిపించింది. ఒక హెలి కాప్టర్‌జాతీయ పతాకాన్ని.. మరొకటి 'వందే మాతరం' అని రాసి ఉన్న జెండాను మోసుకెళ్లాయి.

మిగతా 4లో..

# సంగారెడ్డి సభలో రేవంత్ అబద్దాల ప్రచారం

- కెసిఆర్‌ను తిట్టడమే పనిగా పెట్టుకున్న పెద్దమనిషి
- మీడియా సమావేశంలో మండిపడ్డ హరీష్ రావు



సిద్దిపేట,ఆగస్ట్15 : గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం, మాజీ సీఎం కేసీఆర్‌పై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు ఖండించారు. సంగారెడ్డిలో నిర్వహించిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి అడ్డగోలు వ్యాఖ్యలు చేశారని మండిపడ్డారు. దేశంలో స్వాతంత్య దినోత్సవం రోజునా చిల్లర మాటలు మాట్లాడిన ముఖ్యమంత్రి మరొకరు ఉండరని విమర్శించారు. సిద్ధిపేటలోని తన క్యాంప్ కార్యాలయంలో మాజీ మంత్రి హరీశ్ రావు మీడియా సమావేశం నిర్వహించారు. సీఎం రేవంత్ రెడ్డి సాయంత్రం 4:20 గంటలకు ప్రసంగం ప్రారంభించి 420 మాటలు మాట్లాడారని మండిపడ్డారు. ఆయన తన ప్రసంగంలో ఉమ్మడి మెదక్ జిల్లా గురించి ఒక్క మాటా మాట్లాడలేదని ధ్వజమెత్తారు. రేవంత్ చేతకానితనం వల్లే సింగూరు ఖాళీ అయిందని ఆరోపించారు. కామారెడ్డి జిల్లాకు మంచినీళ్లు లేకుండా పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. సంగారెడ్డి బాగుపడాలని గత ప్రభుత్వం సంగమేశ్వర, బసవేశ్వర ప్రాజెక్టులను ప్రారంభిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని మూలన పడేసిందని నిప్పులు చెరిగారు. జహీరాబాద్‌లో బసవేశ్వర విగ్రహం ప్రారంభించి ఏడాది అయిందని, ఆ రోజు ఇచ్చిన హామీలు ఒక్కటైనా అమలయ్యాయా? అని హరీశ్ రావు ప్రశ్నించారు. సంగారెడ్డి జిల్లాలో ఈ మూడేళ్లలో ఒక్క రోడ్డు అయినా వేశారా? అని నిలదీశారు. గత ప్రభుత్వ హయాంలో 6 లక్షలకు పైగా రేషన్ కార్డులు ఇచ్చారని అసెంబ్లీలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పారని, కానీ నేడు సంగారెడ్డిలో రేషన్ కార్డులు ఇవ్వలేదని చెబుతున్నారని ఆగ్రహించారు. నిస్సిగ్గుగా అబద్దాలు మాట్లాడే రేవంత్ రెడ్డికి ప్రజలే బుద్ధి చెబుతారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ నోటిఫికేషన్లు ఇచ్చి పరీక్షలు నిర్వహిస్తే రేవంత్ నియామక పత్రాలు ఇచ్చారని ఎద్దేవా చేశారు. ఎంపీ రాహుల్ గాంధీని పిలిచి 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పారని, మాట తప్పినందుకు నిరుద్యోగులకు రేవంత్ క్షమాపణలు చెప్పాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. గన్‌మెన్లు లేకుండా అశోక్ నగర్‌కు వస్తావా? అంటూ ఈ సందర్భంగా మాజీ మంత్రి సవాల్ విసిరారు. మరోవైపు, రెండేళ్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ ఎప్పుడూ ఇస్తారో చెప్పాలన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వని ఆ కాలేజీలు, విద్యార్థుల భవిష్యత్తు ఏంటని ప్రశ్నించారు. విద్యార్థులు, నిరుద్యోగుల జీవితాలతో ఆటలు ఆడుతున్నారని మండిపడ్డారు. అలాగే, రైతుల గురించి మాట్లాడే అర్హత రేవంత్ రెడ్డికి లేదన్నారు. కేసీఆర్ హయాంలో వరుసగా మూడేళ్లలో రూ.14,656 కోట్లు, రూ.14,721 కోట్లు, రూ.14,721 కోట్లు చొప్పున రైతు బంధు ఇచ్చారని పేర్కొన్నారు. 2024–25లో రేవంత్ ఇచ్చింది రూ.5,057 కోట్లేనని మండిపడ్డారు. 2025–26లో రూ.11 వేల కోట్లు మాత్రమే ఇచ్చారని ఆరోపించారు. కేసీఆర్ ఇచ్చిన దానికంటే రూ.15 వేల కోట్లు రేవంత్ తక్కువ ఇచ్చారని విమర్శించారు. రేవంత్ రెడ్డి సొంత ఊరికి వెళ్లి రుణమాఫీ అయ్యిందో, లేదో అక్కడి రైతులను అడగాలన్నారు. ఆ రైతులు రుణమాఫీ అయ్యిందని చెబితే తాను రాజీనామా చేస్తానని, అవ్వలేదని చెబితే రేవంత్ రెడ్డి రాజీనామా చేస్తారా? అని సవాల్ చేశారు.

# పేదల పెన్నిది మా సర్కార్



స్మార్ట్ కార్డుల పంపిణీలో మంత్రి పొంగులేటి

హనుమకొండ,ఆగస్ట్15 : పేదల ముఖంలో చిరునవ్వు చూడటమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శనివారం హనుమకొండలోని అంబేద్కర్ భవన్‌లో నిర్వహించిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. అనంతరం ఎంపీ డాక్టర్ కావ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, నాగరాజు, కలెక్టర్ చాహత్ బాజ్ పాయి లతో కలిసి లబ్దిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. రేషన్ కార్డు అనేది కేవలం ఒక గుర్తింపు పత్రం కాదని, పేద కుటుంబాలకు ఆహార భద్రతతోపాటు అనేక సంక్షేమ పథకాలకు ఆధారమని పేర్కొన్నారు.

# ప్రజల అవసరాలు గుర్తించి సంక్షేమ పాలన



- అన్ని వర్గాలకు న్యాయం చేయడం కోసం కృషి
- స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీలోడిప్యూటి సిఎం భట్టి

వివరాలు 2లో..

# తెలంగాణ రైజింగ్-2047' దిశగా అడుగులు వేస్తున్నాం

- కీలక బాధ్యతగా ఉద్యోగ నియామకాలు
- ఇప్పటికే 72 వేల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ
- గ్రూప్ పరీక్షలను సమర్థంగా నిర్వహించాం
- త్వరలోనే ఇంటర్‌నేషనల్ స్పోర్ట్స్ నిర్వహణ
- ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంచాం



- గోల్కొండ కోట నుంచి ప్రజలనుద్దేశించి సిఎం రేవంత్ ప్రసంగం



హైదరాబాద్, ఆగస్టు 15 : ఉద్యోగ నియామకాలను ప్రభుత్వం అత్యంత కీలక బాధ్యతగా తీసుకుందని, ఇప్పటి వరకు 72 వేలకు పైగా ప్రభుత్వ ఉద్యోగ నియామకాలను పూర్తి చేశామని సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు. గ్రూప్1, గ్రూప్-2, గ్రూప్-3, గ్రూప్-4, మెగా డీఎస్సీ నియామకాలను విజయవంతంగా నిర్వహించి నియామక పత్రాలు అందించామని తెలిపారు. యువతకు నైపుణ్యం, ఉద్యోగాలు కల్పించేందుకు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామని, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా మిగతా 3లో..

# దేశంలో ఎక్కడా సన్నబియ్యం పంపిణీ లేదు



- 89 లక్షల కార్డులను 2.80 కోట్లకు చేర్చాం
- బిఆర్ఎస్ నేతలు తప్పుడు ప్రచారాలు మానాలు
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

2లో..

# గోల్కొండ కోటలో త్రివర్ణపతాకం రెపరెప

- తొలిసారి పూర్తిస్థాయి వందేమాతర గీతాలాపన



హైదరాబాద్,ఆగస్ట్15 : గోల్కొండ కోటలో 80వ స్వాతంత్య్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు. గోల్కొండ కోటపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం పోలీసుల గౌరవ వందానాన్ని స్వీకరించారు. ఇక, గోల్కొండ కోటపై తొలిసారిగా 'వందే మాతరం' గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా కోట ప్రాంగణం దేశభక్తి నినాదాలతో మార్మోగింది. 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రజలందరికీ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు. స్వాతంత్య వేడుకలు ప్రజల్లో నూతన ఉత్సాహం, చైతన్యం నింపాలన్నారు. అభివృద్ధి చెందిన భారతదేశ నిర్మాణానికి కొత్త ఊపునివ్వాలని ఆకాంక్షించారు. స్వాతంత్య సమర యోధుల త్యాగాలను స్మరించు కోవాలని పిలుపునిచ్చారు. భిన్నత్వంలో ఏకత్వాన్ని కాపాడుతూ దేశభక్తి, పరస్పర గౌరవం పెంపొందించాలని అన్నారు. అసమానతలు లేని శాంతియుత, సౌభ్రాతృత్వ భారతదేశాన్ని నిర్మించాలని తెలిపారు. సమరయోధుల త్యాగాలకు అదే నిజమైన నివాళి అని సీఎం వ్యాఖ్యానించారు. సమన్యాయం, సమానత్వం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వంతో 80వ స్వాతంత్య దినోత్సవం జరుపుకోవాలని ఆకాంక్షించారు. నవ భారత నిర్మాణంలో ప్రతి పౌరుడు కర్తవ్యనిష్టతో ముందుకు సాగాలంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు.

# అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి రేషన్ కార్డు



- ప్రజాప్రభుత్వం రాగానే కార్డులు అందచేశాం
- ప్రతి వ్యక్తికి 6 కిలోల సన్నబియ్యం అందిస్తున్నాం
- స్మార్ట్ కార్డుల పంపిణీలో మంత్రి పొన్నం ప్రభాకర్

వివరాలు 2లో..

# ప్రజల అవసరాలు గుర్తించి సంక్షేమ పాలన



- అన్ని వర్గాలకు న్యాయం చేయడం కోసం కృషి
- స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీలో డిప్యూటి సిఎం భట్టి

ఖమ్మం,ఆగస్ట్15 : తెలంగాణ ప్రజల అవసరాలే పరమావధిగా ప్రజా ప్రభుత్వం పాలన సాగిస్తోందని ఉప ముఖ్య మంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. కాంగ్రెస్ పాలనలో మహిళలు, విద్యార్థులు, రైతులు సహా అన్ని వర్గాలకూ సం క్షేమం అందుతోందని పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా కలెక్టరేట్‌లో తెలంగాణ రాష్ట్ర పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. డిప్యూటీ సీఎం భట్టి ముఖ్య అతిథిగా హాజరై లబ్దిదారులకు కార్డులు అందజేశారు. మిగతా 3లో..

# ఏపనిచేసినా కచ్చితత్వంతో చేయాలి

- యువతకు మంత్రి నిర్మలాసీతారామన్ హితవు



న్యూఢిల్లీ,ఆగస్ట్15 : ఏ పని చేసినా ఎంతో జాగ్రత్తగా, కచ్చితత్వంతో చేయాలని యువ ఇంటర్న్‌లకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సూచించారు. ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ పథకం కింద ఇంటర్న్ షిప్ చేస్తున్న యువతతో న్యూఢిల్లీలో నిర్మలా సీతారామన్ తాజాగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పని పట్ల బాధ్యత, నిబద్ధత, కచ్చితత్వం ఎంత ముఖ్యమో వివరించారు. 'మీరు ఏ పని చేస్తున్నా జాగ్రత్తగా చేయండి. దాన్ని అత్యంత కచ్చితంగా చేయడానికి ప్రయత్నించండి. ఎందుకంటే మీరు చేసే చిన్న పొరపాటు తర్వాత మరొక వ్యక్తికి తీవ్ర పరిణామాలను కలిగించవచ్చు' అని నిర్మలా సీతారామన్ అన్నారు. ఒక వాహనంలోని చిన్న భాగాన్ని తయారు చేసే సమయంలో జరిగిన పొరపాటు చివరకు ఆ వాహనాన్ని కొనుగోలు చేసిన వ్యక్తిపై ప్రభావం చూపవచ్చని అన్నారు. అది ప్రాణాలకు ప్రమాదం కలిగించవచ్చని, లేదా మరమ్మతుల కోసం వినియోగదారుడు నిరంతరం డబ్బు ఖర్చు చేయాల్సి రావచ్చని వివరించారు. బ్యాంకింగ్ రంగంలో పొరపాటున రూ.1,000 బదులు రూ.1 లక్ష బదిలీ చేస్తే ఆ నష్టాన్ని ఎవరు భరిస్తారని ఆమె ప్రశ్నించారు (ఎనిటబీబబిసా బీత్గి÷బె). అదేవిధంగా డిజిటల్ సమాచారాన్ని నిర్వహించే సమయంలో ఒక వ్యక్తి పేరు, ఖాతా లేదా ఇతర వివరాల్లో చిన్న తప్పు జరిగినా ఆ వ్యక్తికి కొత్త సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉందన్నారు. బాధ్యతలు నిర్వర్తించే సమయంలో తమ పని వల్ల ప్రయోజనం పొందే వినియోగదారుడిని దృష్టిలో ఉంచుకోవాలని నిర్మలా సీతారామన్ సూచించారు.

# తెలంగాణపై ఎపి నీటి కుట్రలు

- కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్‌కు లేఖ దుర్మార్గం
- మండిపడ్డ మాజీమంత్రి శ్రీనివాస గౌడ్



హైదరాబాద్,ఆగస్ట్15 : తెలంగాణ నీటిపై ఏపీ మళ్లీ కుట్రలు మొదలు పెట్టిందని మాజీ మంత్రి వీ శ్రీనివాస్ గౌడ్ ఫైర్ అయ్యారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ..ఆంధ్రప్రదేశ్ ఈఎన్‌సీ చైర్మన్ కృష్ణారివర్ మేనేజ్‌మెంట్ బోర్డుకి లేఖ రాశాడు. ఆయన వాళ్ల రాష్ట్రం గురించి మాట్లాడాలి కానీ తెలంగాణ రాష్ట్రానికి కృష్ణా రివర్ బేసిన్‌లో ఉన్న ప్రాంతానికి కేవలం 30 టీఎంసీల నీళ్లు మాత్రమే ఇవ్వాలని.. అంటే 30 శాతం మాత్రమే తెలంగాణకు ఇవ్వండి.. మిగితా నీళ్లు మేం తీసుకుపోతం. అంటే 146 టీఎంసీలు మేం తీసుకెళ్తం.. 30 టీఎంసీలు తెలంగాణ వాళ్లకు ఇచ్చేయండి అని.. ఆయన ఎవరు... తెలంగాణ గురించి రాయడానికి నీకు ఎవరు అధికారం ఇచ్చిండన్నారు. 100 శాతం కృష్ణా బేసిన్‌లో ఉన్న ప్రాంతాన్ని వదిలిపెట్టి నువ్వు కృష్ణా బేసిన్ నుంచి పెన్నా బేసిన్‌కు కృష్ణా రివర్‌కు 80–90 శాతం నీళ్లు తీసుకుపోతున్నరు. పోతిరెడ్డి పాడు ద్వారా 10 వేల క్యూసెక్కులు అని చెనప్పి 30 వేల క్యూసెక్కుల నీళ్లు తీసుకెళ్లి ఆ ప్రాంతంలో నింపుకుంటున్నరని ఆరోపించారు. తెలంగాణకు ఎన్ని నీళ్లు ఇవ్వాలో డిసైడ్ చేయడానికి వాడు ఎవడు..? ఏపీ ఈఎన్‌సీ లేఖ రాసిన రోజే తెలంగాణ ఈఎన్‌సీ కూడా లేఖ రాశాడు. మాకు కృష్ణా నదిపై రిజర్వాయర్లు లేవు, నీటిని ఏపీకి ఇబ్బంది లేకుండా ఇవ్వాలని తెలంగాణ ఈఎన్‌సీ లేఖ రాశాడు.. ఏదుల, నార్లాపూర్ రిజర్వాయర్లు లేవా..? 10 ఏళ్లలో తెలంగాణ నీటిపై లేని కుట్రలు మళ్లీ ఎందుకు మొదలవుతున్నాయి..? తెలంగాణ ప్రభుత్వం చేతకానిది అనే కదా..? ఏపీ మోచేతి కింద బతుకుతుందనే కదా..? తెలంగాణకు అన్యాయం చేసే అధికారులను వదిలిపెట్టము, జాగ్రత్త అని శ్రీనివాస్ గౌడ్ హెచ్చరించారు. తెలంగాణ ఈఎన్‌సీకి లేఖ రాయమని ఎవరు చెప్పారు..? రేవంత్ రెడ్డి చెప్పాడా..? అని అడిగారు.

# హైదరాబాద్ చంపాపేటలో విషాద ఘటన

## అన్నను చంపి..తమ్ముడు పరార్

హైదరాబాద్,ఆగస్ట్15 : నగరంలోని చంపాపేట కుమ్మరి బస్తీలో శనివారం తీవ్ర విషాదం చోటుచేసుకుంది. కుటుంబ తగాదాల కారణంగా సొంత తమ్ముడే కసాయిగా మారి, కత్తెరతో పొడిచి సొంత అన్నను అత్యంత దారుణంగా హత్య చేసిన ఘటన కలకలం రేపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చంపాపేట కుమ్మరి బస్తీలో నివాసముంటూ ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్న ముదావత్ వెంకటేష్ (28)కు, పక్క వీధిలోనే నివసిస్తున్న అతడి తమ్ముడు శివ (26)తో గత కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. వీరి తండ్రి మరణించిన నాటి నుంచి అన్నదమ్ముల మధ్య కుటుంబ విషయాల్లో వివాదాలు మరింత తీవ్రస్థాయికి చేరాయి. ఈ క్రమంలోనే శనివారం అన్నదమ్ముల మధ్య మరోసారి తీవ్రస్థాయిలో ఘర్షణ చోటుచేసుకుంది. ఆవేశానికి గురైన తమ్ముడు శివ, ఇంట్లోని కత్తెర తీసుకుని అన్న వెంకటేష్‌పై విచక్షణారహితంగా దాడి చేసి పొడిచేశాడు. తీవ్రంగా గాయపడిన వెంకటేష్‌ను గమనించిన స్థానికులు వెంటనే ఆస్పత్రికి తరలించేందుకు ప్రయత్నించారు. అయితే, మార్గమధ్యలోనే అతడు మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. అన్నను పొడిచిన అనంతరం నిందితుడు శివ అక్కడి నుంచి పరారయ్యాడు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న సరూర్ నగర్ పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. బాధితుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. పరారీలో ఉన్న నిందితుడు శివ కోసం గాలింపు చర్యలు వేగవంతం చేశారు.

# రోడ్డు ప్రమాదంలో ఇంటర్ విద్యార్థిని మృతి



shutterstock.com · 356091701

హైదరాబాద్,ఆగస్ట్15 : ఘట్కేసర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. వందన హోటల్ సమీపంలో స్కూటీని వెనుక నుంచి లారీ ఢీకొట్టడంతో ఓ ఇంటర్ విద్యార్థిని దుర్మరణం చెందింది. ఈ ఘటన స్థానికంగా విషాదాన్ని నింపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వారాసిగూడకు చెందిన సురేష్ తన భార్య, కుమార్తె శ్రావణితో కలిసి స్కూటీపై సొంత గ్రామానికి వెళ్తున్నారు. వందన హోటల్ సమీపంలోకి చేరుకోగానే వెనుక నుంచి వచ్చిన లారీ వారి స్కూటీని బలంగా ఢీకొట్టింది. ఈ క్రమంలో శ్రావణి రోడ్డుపై పడిపోగా.. ఆమెపై నుంచి లారీ వెళ్లడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలు ఇంటర్ చదువుతున్నట్లు సమాచారం. ప్రమాదం గురించి సమాచారం అందుకున్న ఘట్కేసర్ పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. ప్రమాదానికి సంబంధించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# కృష్ణాలో ఈతకు వెళ్లిన ముగ్గురు యువకులు గల్లంతు



విజయవాడ,ఆగస్ట్15:కృష్ణా నదిలో ఈతకు వెళ్లిన ముగ్గురు యువకులు గల్లంతైన ఘటన విజయవాడలో విషాదం నింపింది. కృష్ణా నదిలో గల్లంతైన ముగ్గురు యువకుల మృతదేహాలను పోలీసులు వెలికి తీశారు. కృష్ణలంకకు చెందిన గౌతమ్, జాషువా, తేజ ఈతకు వెళ్లిన సమయంలో నదిలో గల్లంతయ్యారు. వారి కోసం పోలీసులు, గజ ఈతగాళ్లు చేపట్టిన గాలింపు చర్యల్లో మృతదేహాలు లభ్యమయ్యాయి. ముగ్గురు యువకుల మృతదేహాలు బయటపడటంతో వారి కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. తమ పిల్లలను కోల్పోయిన తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఘటనాస్థలంలో విషాదకర వాతావరణం నెలకొంది. ఈ ఘటన జరిగిన ప్రాంతం తాడేపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోకి వస్తుండటంతో కృష్ణలంక పోలీసులు తాడేపల్లి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనకు సంబంధించిన వివరాలను తాడేపల్లి పోలీసులు సేకరిస్తున్నారు.

# ప్రజల అవసరాలు గుర్తించి సంక్షేమ పాలన

- అన్ని వర్గాలకు న్యాయం చేయడం కోసం కృషి
- స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీలో డిప్యూటి సిఎం భట్టి



ఖమ్మం,ఆగస్ట్15 : తెలంగాణ ప్రజల అవసరాలే పరమావధిగా ప్రజా ప్రభుత్వం పాలన సాగిస్తోందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. కాంగ్రెస్ పాలనలో మహిళలు, విద్యార్థులు, రైతులు సహా అన్ని వర్గాలకూ సంక్షేమం అందుతోందని పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా కలెక్టరేట్‌లో తెలంగాణ రాష్ట్ర పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. డిప్యూటీ సీఎం భట్టి ముఖ్య అతిథిగా హాజరై లబ్దిదారులకు కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వం కొత్త రేషన్ కార్డుల జారీ విషయంలో కాలయాపన చేసిందని విమర్శించారు. ప్రజా పంపిణీ వ్యవస్థలో నకిలీలను పూర్తిగా అరికట్టేందుకు ఈ కొత్త స్మార్ట్ కార్డులలో ఎన్క్రిప్టెడ్ క్యూఆర్ కోడ్, ప్రత్యేక హోలోగ్రామ్, వాటర్ మార్క్, యూవీ లోగో సహా 9 రకాల పటిష్టమైన భద్రతా ఫీచర్లను పొందుపరిచామని భట్టి అన్నారు. ఈ-పాస్ యంత్రాలతో బయోమెట్రిక్ విధానాన్ని అనుసంధానించి రేషన్ పంపిణీలో నూరు శాతం పారదర్శకతను తీసుకువస్తున్నామన్నారు. ఃాష్ట్రంలోని ప్రతి నిరుపేద కుటుంబానికి ఆహార భద్రత కల్పించడమే లక్ష్యంగా 3.42 కోట్ల మందికి నెలకు 6 కిలోల చొప్పున సన్న బియ్యాన్ని ఉచితంగా అందిస్తున్నాం. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఈ సరికొత్త డిజిటల్ కార్డులు మంజూరు చేస్తూ, వాటి ద్వారా అనేక సంక్షేమ పథకాలను ప్రజలకు మరింత చేరువ చేస్తున్నాం.పేదలకు మెరుగైన వైద్యం కోసం రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంచడంతో పాటు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్ల ద్వారా సొంతింటి కల సాకారం, మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణం వంటి పథకాలతో ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడమే మన ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అన్నారు. తెలంగాణను దేశంలోని ఇతర రాష్ట్రాలతోనే కాకుండా, ప్రపంచంలోని అభివృద్ధి చెందిన దేశాలతో పోటీపడే స్థాయికి తీసుకెళ్లేలా మన ప్రభుత్వం అడుగులు వేస్తోందని భట్టి తెలిపారు. మహిళా సాధికారతకు కాంగ్రెస్ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంతో పాటు, స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాలు అందిస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్రంలోని ప్రతి విద్యార్థికి అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యను అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తోందని తెలిపారు. ఈ మేరకు రాష్ట్రవ్యాప్తంగా ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టిందని భట్టి చెప్పుకొచ్చారు. విద్యా రంగంలో మౌలిక సదుపాయాలను మెరుగుపరిచి విద్యార్థులకు మంచి భవిష్యత్తును అందించేందుకు చర్యలు చేపడుతున్నామని ఆయన పేర్కొన్నారు. మరోవైపు, అన్నదాతల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. రైతు భరోసాతో పాటు అనేక సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నామని చెప్పారు. రైతులకు అండగా నిలుస్తూ వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని వివరించారు. తెలంగాణ ప్రజల ఉజ్వల భవిష్యత్తుకు బలమైన పునాదులు వేస్తున్నామని డిప్యూటీ సీఎం పేర్కొన్నారు. తెలంగాణను దేశంలోని ఇతర రాష్ట్రాలతోనే కాకుండా ప్రపంచంలోనే అభివృద్ధి చెందిన దేశాలతో పోటీపడే స్థాయికి తీసుకెళ్లడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. అనంతరం స్మార్ట్ రేషన్ కార్డులు అందుకున్న లబ్దిదారులకు భట్టి విక్రమార్క శుభాకాంక్షలు తెలిపారు.

# దేశంలో ఎక్కడా సన్నబియ్యం పంపిణీ లేదు

- 89 లక్షల కార్డులను 2.80 కోట్లకు చేర్చాం
- బిఆర్ఎస్ నేతలు తప్పడు ప్రచారాలు మానాలు
- సంగారెడ్డి సభలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



సంగారెడ్డి,ఆగస్ట్15 : తెలంగాణలో ఇస్తున్నట్టు దేశంలో ఎక్కాడా కూడా సన్నబియ్యం పంపిణీ జంగడం లేదని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. సంగారెడ్డిలో నిర్వహించిన కొత్త స్మార్ట్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ.. 3.42 కోట్ల మందికి రూ.14800 కోట్లతో సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని చెప్పారు. బిఆర్ఎస్ ప్రభుత్వంలో 89 లక్షల రేషన్ కార్డులు ఉంటే.. వాటిని 2.80 కోట్లకు పెంచామని తెలిపారు. రేషన్ కార్డుల మంజూరు.. నిరంతర పక్రియ అని స్పష్టం చేశారు. బిఆర్ఎస్ పార్టీలోని నేతలు పదే పదే అబద్దాలు చెబుతున్నారని మండిపడ్డారు. మేడిగడ్డ, సుందిళ్ల నుంచి చుక్క నీరు తీసుకోకుండా దేశంలోనే ఎక్కువ ధాన్యాన్ని తెలంగాణలో పండించామన్నారు. వరి కొనుగోళ్లలో రూ.90 వేల కోట్లు.. రైతుల ఖాతాల్లో వేశామని అన్నారు. ఈరోజు సంగారెడ్డి చరిత్రలోనే కాదు, తెలంగాణ చరిత్రలోనే ప్రత్యేకమైన రోజుగా నిలిచిపోనుందన్నారు. తెలంగాణ ఏర్పడ్డ తర్వాత పదేళ్లు అధికారంలో ఉన్నవాళ్లు రేషన్ కార్డులు ఇవ్వలేదని మంత్రి విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక నిరుపేదలకు రేషన్ కార్డుల్లో విప్లవాత్మక మార్పులు తెచ్చిందని వెల్లడించారు. కొత్తగా 16 లక్షల మందికి రేషన్ కార్డులు ఇచ్చామని అన్నారు. ఃఖా హయాంలో రేషన్ కింద దొడ్డు బియ్యం ఇచ్చారని.. అప్పుడు ఆ బియ్యాన్ని ఎవరూ తినకుండా కిలో రూ.10కి అమ్ముకునే వారని తెలిపారు. కాంగ్రెస్ వచ్చాక సన్న వడ్లకి రూ.500 బోనస్ ఇచ్చి కొనుగోలు చేసి వాటినే పంపిణీ చేస్తున్నామని చెప్పారు. నాణ్యత ఉన్న సన్న బియ్యాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం పంపిణీ చేస్తోందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

# అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి రేషన్ కార్డు

## మంత్రి పొన్నం ప్రభాకర్




సిద్దిపేట,ఆగస్ట్15 : ప్రజా పాలనలో అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి 16 లక్షల కొత్త రేషన్ కార్డులు మంజూరు చేశాం. ఇది నిరంతర పక్రియగా 365 రోజులు కొనసాగుతుందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. రేషన్ కార్డుతో పాటు ప్రతి వ్యక్తికి 6 కిలోల సన్నబియ్యం అందిస్తున్నాం. గ్రామాలు, మండలాల్లో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీని పండుగ వాతావరణంలో నిర్వహించాలని అధికారులకు సూచించాం.కొత్తగా రేషన్ కార్డులు పొందిన కుటుంబాల ఆనందం ప్రభుత్వానికి మరింత ప్రేరణనిచ్చే అంశంగా నిలుస్తోంది. సంగారెడ్డిలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు ప్రారంభించిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని నేడు సిద్దిపేటలో లాంఛనంగా ప్రారంభించుకుంటున్నాం అని అన్నారు. పేదల సంక్షేమమే లక్ష్యంగా ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500 గ్యాస్ సబ్సిడీ, ఇందిరమ్మ ఇళ్లు, కొత్త పెన్షన్లు వంటి పథకాలను అమలు చేస్తున్నాం. రాష్ట్రంలో 2.5 లక్షల కొత్త పెన్షన్లు మంజూరు చేస్తున్నామని మంత్రి వెల్లడించారు. 70 వేలకు పైగా ఉద్యోగాలు కల్పించడంతో పాటు మరిన్ని ఉద్యోగ నోటిఫికేషన్లు రాబోతున్నాయి. మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో బస్సులు, పెట్రోల్ బంకులు, సోలార్ పవర్ వంటి అవకాశాలు కల్పిస్తున్నామని అన్నారు. సిద్దిపేట పట్టణంలోని వైశ్య కన్వెన్షన్ భవనంలో లబ్దిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేయడం జరిగింది కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హైమవతి ,అడిషనల్ కలెక్టర్ లక్ష్మీ కిరణ్ , పద్మశాలి ఫెడరేషన్ చైర్మన్ గూడూరి శ్రీనివాస్ ,లైబ్రరీ చైర్మన్ ధరిపల్లి చంద్రం , ఎస్సీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకయ్య, ఆర్టీఏ మెంబర్ సూర్య వర్మ , మార్కెట్ కమిటీ చైర్మన్‌లు ,వివిధ గ్రామాల సర్పంచ్‌లు.. పాల్గొన్నారు.జిల్లాలోని ఆరు నియోజకవర్గాలకు చెందిన లబ్దిదారులకుస్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు.

# 370 ఆర్టికల్ రద్దుచేయకుంటే పివోకె కలిసేది

- కాశ్మీర్ సిఎం ఓమర్ అబ్దుల్లా సంచలన వ్యాఖ్యలు



శ్రీనగర్,ఆగస్ట్15 : పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ పరిస్థితులపై జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా కీలక వ్యాఖ్యలు చేశారు. జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక హోదా, రాష్ట్ర హోదాను 2019లో రద్దు చేయకపోయి ఉంటే.. ఇప్పుడు పీవోకే ప్రజలు జమ్మూ కశ్మీర్‌లో తిరిగి విలీనం కావాలని కోరుతూ ఉద్యమించేవారని ఆయన అన్నారు. స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా శ్రీనగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఒమర్ అబ్దుల్లా ఈ వ్యాఖ్యలు చేశారు. పీవోకేలో ప్రజాస్వామ్య హక్కుల కోసం ఆందోళన చేస్తున్న ప్రజలపై జరుగుతున్న పరిణామాలు తనను బాధిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. అక్కడ పలువురు ప్రాణాలు కోల్పోగా, మరికొందరు గాయపడి జైలుకు వెళ్లాల్సి వచ్చిందని చెప్పారు. 1947లో పాకిస్థాన్ నుంచి వచ్చిన ఆక్రమణదారులను ఎదుర్కొన్న కశ్మీరీ ప్రజలను ఒమర్ అబ్దుల్లా గుర్తుచేసుకున్నారు. తన తాత, జమ్మూకశ్మీర్ తొలి ప్రధానమంత్రి షేక్ మహ్మద్ అబ్దుల్లా నేతృత్వంలోని కశ్మీరీలు ఆక్రమణదారులను ఎదుర్కొన్నారని చెప్పారు. భారత సైన్యం కశ్మీర్‌కు చేరుకోవడానికి ముందే స్థానిక ప్రజలు తమ ప్రాంతాన్ని రక్షించేందుకు పోరాడారని ఒమర్ అబ్దుల్లా పేర్కొన్నారు. 2019లో జమ్మూకశ్మీర్ రాష్ట్ర హోదా, ప్రత్యేక హోదాను రద్దు చేయకపోయి ఉంటే.. ఈ రోజు పీవోకే ప్రజలు జమ్మూకశ్మీర్‌లో తిరిగి విలీనం కావాలని కోరుతూ ఉద్యమించేవారని అన్నారు. జమ్మూకశ్మీర్ అసెంబ్లీలో పీవోకేకు సంబంధించిన స్థానాలను ఖాళీగా ఉంచామని, ఏదో ఒక రోజు అవి భర్తీ అవుతాయని ఆశిస్తున్నామని తెలిపారు. జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదాను, ఇతర రాజ్యాంగపరమైన హామీలను పునరుద్ధరించేందుకు తమ ప్రభుత్వం పోరాటం కొనసాగిస్తుందని అబ్దుల్లా స్పష్టం చేశారు.

# ఫుడ్ సేఫ్టీ అధికారుల దాడి

- పాడైన ఆహార పదార్థాల తయారీ గుర్తింపు

రంగారెడ్డి,ఆగస్ట్15 : కల్తీ ఆహార తయారీ కేంద్రంపై హెచ్‌ఫాస్ట్, జీహెచ్ఎంసీ ఫుడ్ సేఫ్టీ, టాస్క్‌ఫోర్స్ పోలీసులు సంయుక్తంగా దాడులు చేశారు. జిల్లాలోని బొంగుళూర్‌లో ఫుడ్ ప్రొడక్ట్స్‌పై జరిపిన తనిఖీల్లో విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయి. గడువు ముగిసిన ముడిసరుకులతో ఆహార పదార్థాలను తయారు చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. లేబుల్స్ లేని రసాయన సువాసన ద్రవ్యాలతో నాసిరకం ఆహారాన్ని తయారు చేస్తునట్టు తేలింది. నిర్వాహకులు అత్యంత అపరిశుభ్ర వాతావరణంలో ఆహార పదార్థాలను తయారీ చేస్తున్నట్లు అధికారుల దాడుల్లో బయటపడింది. వ్యాపారంలో లాభాలు రాకపోవడంతో ఈజీ మనీ కోసం అక్రమంగా నాణ్యత లేని ఆహారపదార్థాల తయారీకి ప్లాన్ చేసినట్లు గుర్తించిన అధికారులు.. తనిఖీల అనంతరం యజమాని మహ్మద్ ఖాలీద్, మేనేజర్ సంతోష్ కుమార్‌ను అరెస్ట్ చేశారు. ఫుడ్ సేఫ్టీ అధికారుల దాడుల్లో దాదాపు 4.07 లక్షల విలువైన ఆహార పదార్థాలు, ముడిసరుకును స్వాధీనం చేసుకున్నారు. ముడిసరుకు గడువు ముగిసిన ఫ్లేవర్లు, కాజూ, కొబ్బరి పొడి తదితర పదార్థాలను సీజ్ చేసిన అధికారులు.. నిందితులపై ఆదిభట్ల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.

# సాగర్ ఆయకట్టుకు గోదావరి జలాలు

- రాజీవ్ లింక్ కెనాల్ ద్వారా విడుదల
- మంత్రి తుమ్మల

భద్రాద్రి కొత్తగూడెం,ఆగస్ట్15 : ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు సరిగ్గా లేక పంటల సాగుకు ఇబ్బందులు ఏర్పడ్డాయని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. రాజీవ్ లింక్ కెనాల్ ద్వారా గోదావరి జలాలు.. సాగర్ ఆయకట్టుకు భరోసాగా మారిందన్నారు. మారేళ్లపాడు ఎత్తిపోతల పథకాన్ని నెలాఖరులోపు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నీళ్ల దగ్గర రాజకీయాలు చేస్తే ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. రాజీవ్ లింక్ కెనాల్‌కు గోదావరి జలాలను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విడుదల చేశారు. శనివారం అశ్వాపురం మండలం సీతారామ పంప్ హౌస్ వద్ద మంత్రి తుమ్మల, ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు.. మోటార్ స్విచ్ ఆన్ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రైతులు ఎవరూ కూడా దిగులు పడొద్దని.. మీ భూముల్లో పైప్‌లైన్ వేసిన మరలా పూడ్చి ఇస్తామని మంత్రి చెప్పారు. యధావిధిగా మళ్లీ వ్యవసాయం చేసుకోవచ్చని అన్నారు. పినపాకకి నీళ్లు ఇవ్వకుండా ఖమ్మంకి తీసుకెళ్లటం బాధగా ఉందన్నారు. ఎన్ని అడ్డంకులు వచ్చినా.. ఎవరు ఎటువంటి రాజకీయాలు చేసినా నెలాఖరుకు మారేళ్లపాడు ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేస్తామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు.

# ఎందరో మహానుభావుల త్యాగం స్వాతంత్య్రం

- జెండా ఆవిష్కరణలో గుత్తా సుఖేందర్ రెడ్డి

భువనగిరి,ఆగస్ట్15 : 80వ, భారత స్వాతంత్య దినోత్సవము సందర్భంగా యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని జూనియర్ కాలేజ్ ప్రాంగణంలో జాతీయ పతాకాన్ని ముఖ్య అతిధి హోదాలో మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా 80వ భారత స్వాతంత్య్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపి ఎందరో మహనీయుల పోరాటం గుర్తుచేసుకుని, వారి త్యాగాలకు ఈ సందర్భంగా ఘన నివాళులు అర్పించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, అలాగే దేశంలో తెలంగాణ రాష్ట్రం ఎలా ప్రగతి పథంలో నడుస్తుందో వివరించారు. దేశభక్తిపై విద్యార్థులు చేసిన నృత్య ప్రదర్శనలు ఎంతగానో ఆకర్షించాయి. విధులలో ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు ప్రశంస పత్రాలు అందజేయడం జరిగింది. కార్యక్రమంలో భువనగిరి ఎమ్మెల్యే కుంభంఅనిల్ కుమార్ రెడ్డి, జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి , ఎస్పీ అక్షాంశ్ యాదవ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, రెవిన్యూ అదనపు కలెక్టర్ వెంకారెడ్డి, మున్సిపల్ కమిషనర్ శ్రీవాణి, వైస్ చైర్మన్ మంజుల, గ్రంధాలయ చైర్మన్ అవేజ్ చిస్తీ ,జడ్పీ సిఈఓ శోభారాణి జిల్లా అధికారులు, అమరవీరుల కుటుంబ సభ్యులు, విద్యార్థి విద్యార్థినిలు, ప్రజా ప్రతినిధులుపాల్గొన్నారు.

# నిజామాబాద్‌లో జెండా ఆవిష్కరించిన ప్రభుత్వ సలహాదారు

నిజామాబాద్,ఆగస్ట్15 : జిల్లాలో పంద్రాగస్టు వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ మైదానంలో శనివారం రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ప్రభుత్వ సంక్షేమ పథకాలను తెలియజేస్తూ శకటాలను ప్రదర్శించారు. ఉత్తమ సేవలకు గాను ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందించారు. వేడుకల్లో అదనపు కలెక్టర్ భుజంగరావు, ఎమ్మెల్యేలు రాకేష్ రెడ్డి, భూపతిరెడ్డి, ధన్పాల్ సూర్యనారాయణ, మేయర్ ఉమారాణి, పోలీస్ కమిషనర్ సాయి చైతన్య పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

# (మొదటిపేజీ తరువాయి)

## కృష్ణా-గోదావరి జలాల్లో రాజీపడే ప్రసక్తే లేదు

ఈ ప్రభుత్వ 32 నెలల కృషి ఇప్పుడిప్పుడే కనిపిస్తోందని.. తలసరి ఆదాయంలో టాప్‌లో ఉన్నామన్నారు. వ్యవసాయాన్ని పండగ చేయాలని నిర్ణయించామని తెలిపారు. రైతు బాగుంటేనే.. రాష్ట్రం బాగుంటుందన్న ముఖ్యమంత్రి.. రైతు సంక్షేమం కోసం అనేక పథకాలు చేపట్టామన్నారు. రైతు భరోసా కింద రూ.36వేల కోట్లు పెట్టుబడి సాయం అందించామని చెప్పారు. అలాగే, రైతు సంక్షేమం కోసం రూ.లక్షా 70వేల కోట్లు, రూ.2లక్షల వరకు రైతు రుణమాఫీ చేశామని వివరించారు. సన్న వడ్లకు రూ.500 బోనస్ ఇస్తున్నామన్నారు. ధాన్యం ఉత్పత్తిలో తెలంగాణ రికార్డులు సృష్టించిందని తెలిపారు. కృష్ణా-గోదావరి జలాల్లో రాజీపడే ప్రసక్తే లేదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. తెలంగాణకు రావాల్సిన ప్రతి నీటి బొట్టును సాధించి తీరుతామన్నారు. పెండింగ్ ప్రాజెక్టులు పూర్తిచేసి రైతుల కళ్లల్లో ఆనందం చూస్తామన్నారు. త్వరలోనే పాలమూరు పూర్తి చేసి నీరందిస్తామని తెలిపారు. వ్యవసాయంతో పాటు ఇళ్లకు ఉచిత కరెంట్ ఇస్తున్నామని, కల్యాణలక్ష్మి కింద ఆడబిడ్డలకు రూ.4,790 కోట్లు అందజేశామని అన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసే సంకల్పంతో ఉన్నామని చెప్పుకొచ్చారు. 15 లక్షలకు పైగా కొత్త రేషన్ కార్డులు మంజూరు చేశామని,2 విడతల్లో 5.50లక్షల ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తున్నామని తెలిపారు. క్యూర్ పరిధిలో ఇందిరమ్మ టవర్లు నిర్మించి అందించనున్నామని తెలియజేశారు. దేశంలోనే తొలిసారి తెలంగాణలో కులగణన జరిగిందని.. తెలంగాణ ఒత్తిడి వల్లే కేంద్రం జనగణనలో కులగణన చేర్చిందని తెలిపారు. కొత్తగా 2.50లక్షల మందికి పెన్షన్లు మంజూరు చేస్తున్నామన్నారు. సినీ కార్మికుల సంక్షేమం కోసం త్వరలో బోర్డు ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. విద్యా సూచీలో 21 నుంచి 14వ స్థానానికి తెలంగాణ చేరిందని రేవంత్ తెలిపారు. నియోజకర్గానికొక ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణాన్ని చేపట్టామన్నారు. స్కూళ్లలో అల్పాహారం, మధ్యాహ్న భోజనం పెడుతున్నామని, 100కు పైగా తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు నిర్మించే యోచనలో ఉన్నామని చెప్పారు. అక్రమాలు జరగకుండా ÷ుఉఖాఅని ప్రక్షాళన చేశామన్నారు. మట్టిలో మాణిక్యాలను వెలికితీసేందుకు సీఎం కప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.ఇప్పటికే ఉస్మానియా కొత్త ఆసుపత్రి భవనం నిర్మాణంలో ఉంది. 8 కొత్త మెడికల్ కాలేజీలకు భవనాలు నిర్మిస్తున్నాం. విద్యా సూచీలో 21వ స్థానంలో ఉన్న తెలంగాణ 14కు చేరుకుంది. నియోజకవర్గానికొక ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం చేపట్టాం. వందకు పైగా తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ నిర్మించే లక్ష్యంతో ఉన్నాం. ప్రభుత్వ స్కూళ్లలో ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం పెడుతున్నాం. అక్రమాలు జరగకుండా టీజీపీఎస్సీని ప్రక్షాళన చేశామని అన్నారు. మట్టిలో మాణిక్యాలను వెలికితీసేందుకు సీఎం కప్ పోటీలు నిర్వహించాం. త్వరలో జరిగే ఖేల్ ఇండియా పోటీలకు హైదరాబాద్ అతిథ్యం ఇస్తుంది. టీఎస్ ఐపాస్ ద్వారా రూ.1.95లక్షల కోట్ల పెట్టుబడులు సాధించాం. మరో 78వేలకు పైగా ఉద్యోగ అవకాశాలు రాబోతున్నాయి. ప్రఖ్యాత సంస్థలు హైదరాబాద్ జీసీసీలు ఏర్పాటు చేస్తున్నాయి. నగరంలో ఇప్పటికే 355కు పైగా జీసీసీలు పనిచేస్తున్నాయి. అమెజాన్ సంస్థ రాష్ట్రంలో 7 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెడుతోంది. కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయాలనే ఉక్కు సంకల్పంతో ఉన్నాం. మహిళలను ఆర్టీసీ అ÷-దదె బస్సులకు యజమానులుగా చేశాం. 15 లక్షలకు పైగా కొత్త రేషన్‌కార్డులు మంజూరు చేశాం. రెండో విడత కొత్త రేషన్ కార్డుల పంపిణీ ఇవాళే ప్రారంభించుకుంటున్నాం. వృద్ధ తల్లిదండ్రుల కోసం చట్టం చేసిన తొలి రాష్ట్రం తెలంగాణ అని సీఎం వివరించారు.

## తెలంగాణ రైజింగ్-2047’ దిశగా అడుగులు వేస్తున్నాం

ఐటీఐలు, పాలిటెక్నిక్ కళాశాలలను అప్‌గ్రేడ్ చేస్తున్నామని వివరించారు. గచ్చిబౌలి స్పోర్ట్స్ అకాడమీ, యంగ్ ఇండియా డిజిటల్ ఎంప్లాయ్‌మెంట్ అండ్ స్కిల్లింగ్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తున్నామని, త్వరలోనే తెలంగాణ వేదికగా యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ స్పోర్ట్స్ 2026 నిర్వహించ బోతున్నామని చెప్పారు. గోల్కొండకోటలో త్రివర్ణ పతాకం ఎగురవేసిన సిఎం ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. వైద్యరంగంలో ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచామని, నిమ్స్‌లో 2,000 పడకల నూతన ఆసుపత్రి నిర్మాణంతో పాటు వరంగల్, సనత్‌నగర్, అల్వాల్, ఎల్బీనగర్‌లో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు నిర్మిస్తున్నామని తెలిపారు. కొత్తగా 8 మెడికల్ కళాశాలలు, 16 నర్సింగ్ కళాశాలలు, 28 పారామెడికల్ కళాశాలలను అందుబాటులోకి తెచ్చామని చెప్పారు. దక్షిణ భారతదేశంలోనే తొలి కిడ్నీ ట్రాన్స్‌ఎ లాంటేషన్ సెంటర్ నిర్వహణ ఇందుకు నిదర్శనమని, ఇప్పటి వరకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా 5.18 లక్షల మందికి రూ.2,526 కోట్ల సాయం అందించామని వివరించారు. శాంతిభద్రతల పరిరక్షణలో తెలంగాణ పోలీసులకు సరికొత్త సాంకేతికత, వనరులను అందిస్తున్నామని సీఎం చెప్పారు. సైబర్ నేరాలు, ఆహార కల్తీని ఎదుర్కొనేందుకు డ్రగ్స్ కంట్రోల్, సైబర్, ఆహార కల్తీ నియంత్రణ లను ఒకే గొడుగు కిందకు తీసుకువస్తున్నామని తెలిపారు. ఓఆర్‌ఆర్‌పై ప్రమాదాలు తగ్గించేందుకు హైవే ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సెంటర్లు, మహిళల భద్రతకు షీ టీమ్స్, పిల్లల అనుకూల న్యాయస్థానాల ఏర్పాటులో తెలంగాణ ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. ఉద్యోగుల సంక్షేమం పట్ల శ్రద్ధతో నిర్ణయాలు తీసుకుంటున్నా మని, పీఆర్సీ, పెన్షన్లు, ఎంఎ÷-లాయిస్ హెల్త్ స్కీమ్ వంటివి అమలు చేస్తున్నామని తెలిపారు. 36 సచివాలయ శాఖల్లో 100 శాతం ఈ-ఆఫీస్ అమలు చేశామని, ఈ నెల 17వ తేదీ నుండి అన్ని ఎంపీడీవో కార్యాలయాల్లో 'ప్రజావాణి' ప్రారంభిస్తున్నామని ప్రకటించారు. హైదరాబాద్‌ను ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దేందుకు రీజనల్ రింగ్ రోడ్డు, మెట్రో రెండో దశ, మూసీ పునరుజ్జీవనం, చెరువుల పరిరక్షణకు 'హైడ్రా' ఏర్పాటు వంటి చర్యలు చేపడుతున్నామని సీఎం వివరించారు. పారిశ్రామికంగా టి-ఐడియా ద్వారా రూ.1.29 లక్షల కోట్ల పెట్టుబడులు, తెలంగాణ గ్లోబల్ ఏఐ సమ్మిట్ ద్వారా రూ.5.75 లక్షల కోట్ల ఒప్పందాలు సాధించామని, 2025-26లో ఐటీ ఎగుమతులు రూ.3.97 లక్షల కోట్లకు చేరాయని వెల్లడించారు. తొలి సమగ్ర టూరిజం పాలసీ 2025 తీసుకువచ్చామని, సమ్మక్క సారలమ్మ జాతర అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్లు, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణను మార్చాలనే సంకల్పంతో 'తెలంగాణ రైజింగ్-2047' దిశగా అడుగులు వేస్తున్నామని, అందరి సహకారంతో రాష్ట్ర అభివృద్ధిని ముందుకు తీసుకెళ్తామని సీఎం ప్రసంగాన్ని ముగించారు.

## చరిత్ర తెలుసుకుంటేనే భవిష్యత్ నిర్మాణం



- టిఆర్ఎస్ కార్యాలయంలో జెండా ఆవిష్కరణలో కవిత

హైదరాబాద్,ఆగస్ట్15 : చరిత్రను తెలుసుకున్న వాళ్లే భవిష్యత్తును చక్కగా నిర్మించగలరని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత అన్నారు. టీఆర్ఎస్ రాష్ట్ర కార్యాల యంలో 80వ స్వాతంత్ర్య వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సంద ర్భంగా కవిత జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం మాట్లా డుతూ... బ్రిటీష్ పాలనలో జరిగిన అఘాయిత్యాలు, విభజించి పాలించిన విధానం అందరికీ తెలియాల్సిన అవసరం ఉందన్నారు. రెండు ప్రపంచ యుద్ధాలకు భారతీయులను సైనికులుగా వాడుకొని ఎంతో మంది చావులకు కారణమ య్యారని మండిపడ్డారు. బ్రిటీష్ వాళ్లు వచ్చిన తర్వాతే కుల వ్యవస్థ మరింత పెరిగిందని వ్యాఖ్యా నించారు. అడవుల్లో ఉండే ఆదివాసీలను రాజ్యం పరిధి లోకి తెచ్చి తీరని అన్యా యం చేశారన్నారు. బ్రిటీష్ పరిపాలన పోయినప్పటికీ వాళ్ల ఆలోచనా విధానాన్నే ఇప్పటికీ అమలు చేస్తున్నారని కవిత విమర్శిం చారు. ఇంగ్లీష్ మాట్లాడిన వాళ్లే గొప్ప అన్నట్లుగా చూస్తున్నారని.. తెలుగు భాష మాట్లాడితే తక్కువ చేసి చూస్తున్నారని మండిపడ్డారు. 'తెల్ల తోలు గొప్ప, నల్ల తోలు కాదన్న ట్లుగా ప్రచారం చేసి మనలో మనల్ని శత్రువులను చేశారు' అని అన్నారు. ఆనాటి బ్రిటీష్ వాళ్ల పరిపాలన, ఆలోచనా విధానాన్ని వీడాలని కవిత పేర్కొన్నారు.

## మహిళల అమాయకత్వం ఆసరాగా మోసాలు

- మాయమాటలతో మోసం చేస్తున్న ఇద్దరు పాత నేరస్థుల అరెస్ట్

హైదరాబాద్,ఆగస్ట్15: స్నాప్‌చాట్, ఇన్‌స్టాలో పరిచయం.. ఆ వెంటనే ప్రేమ. ఖరీదైన కార్లలో తిరుగుతూ, విలాసవం తమైన జీవితం చూపిస్తూ నమ్మిస్తారు. మహిళల అమాయకత్వాన్నే పెట్టుబడిగా చేసుకుని, మాయమాటల తో బంగారంతో ఉడాయిస్తున్న ఇద్దరు పాత నేరస్థుల బాగోతాన్ని పేట్‌బషీరా బాద్ పోలీసులు రట్టు చేశారు. ఠాణాలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఇన్ స్పెక్టర్ విజయవర్ధన్, డీఐ అజయ్ కుమార్‌లతో కలిసి మేడ్చల్ ఏసీపీ శం కర్‌రెడ్డి వివరాలను వెల్లడించారు. సం గారెడ్డి జిల్లా కేంద్రానికి చెందిన సాగర్ చౌదరి అలియాస్ సాయి సునీల్, అదే ప్రాంతానికి చెందిన భరత్‌కుమార్ ఇద్ద రూ స్నేహితులు. గతంలో వీరు పలు నేరాలు చేసి జైలుకు వెళ్లి వచ్చారు. సులువుగా డబ్బులు సంపాదించాలని యువతులు, మహిళలను లక్ష్యంగా చేసుకున్నారు. ఇన్‌స్టా, స్నాప్‌చాట్ యాప్‌లో మహిళలతో పరిచయం పెంచుకుని, వారిని కలుసుకునేందుకు ఒప్పిస్తారు. అంగీకరిస్తే వారి వద్దకు వెళ్లేందుకు ముందస్తు ఏర్పాట్లు చేసు కుంటారు. తొలుత రెండు ఖరీదైన కార్లను అద్దెకు తీసుకుంటారు. మంచి దుస్తులు ధరించి పెద్ద కోటీశ్వరుడిలాగా బిల్డప్ ఇస్తారు. ఖరీదైన రెస్టారంట్లకు తీసుకెళ్లి, వారి ఒంటిపై ఉన్న ఆభరణా లను చూసి ఇంత తక్కువే ఉందా అంటూ వెటకారంగా మాట్లాడుతారు. మీ వద్ద ఉన్న బంగారం ఇస్తే.. కొత్తవి, ఇంతకు రెట్టింపు చేయించి ఇస్తామని మాయమాటలు చెబుతారు. ఇదంతా నిజమేనని నమ్మిన మహిళల నుంచి ఆభరణాలు తీసుకుని అక్కడి నుంచి ఉడాయిస్తారు. ఇటీవల ఓ ఫిర్యాదు రావడంతో రంగంలోకి దిగిన పోలీసులు చాకచక్యంగా వారి ఆట కట్టించారు. ఇప్పటి వరకు సుమారు 20 మంది మహిళల నుంచి 40 తులాల బంగారం తస్కరించి విక్రయించినట్టు పోలీసులు నిర్దారణకు వచ్చారు.

## ఒలంపిక్స్‌లో ప్రతి క్రీడలో భారత భాగస్వామ్యం ఉండాల్సిందే

- ఎర్రకోటపై నుంచి క్రీడాకారులకు ప్రధాని మోడీ పిలుపు





న్యూఢిల్లీ, ఆగస్టు 15 : స్వాతంత్ర్య వేడుకల్లో భాగంగా ఎర్రకోట వేదికగా ప్రధాని మోదీ భారత క్రీడా రంగానికి ప్రతిష్ఠాత్మక లక్ష్యాన్ని నిర్దేశించారు. 2036లో జరిగే ఒలింపిక్స్‌లో ప్రతి క్రీడలో భారత భాగస్వామ్యం ఉండేలా చూసుకోవాలన్నారు. ఇందులో భాగంగా ప్రతిభ ఉన్న వారిని గుర్తించి, వారికి మెరుగైన శిక్షణ, సౌకర్యాలు అం దించేందుకు జాతీయస్థాయిలో టాలెంట్ ఐడెంటిఫికేషన్ ప్రోగ్రామ్‌ను ప్రకటించారు. క్రీడా ప్రపంచంలో భారత్ తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంటోంది. ప్రపంచవేదికలపై మన జాతీయ గీతాన్ని తరచూ విం టుంటాం. మన ముువ్వన్నెల జెండా ఎగరవేయడం చూస్తు న్నాం. టాప్స్ గొప్ప విజయాన్ని సాధించింది. ఖేలో ఇండి యా గేమ్స్, యూనివర్సిటీ గేమ్స్, బీచ్ గేమ్స్, వింటర్ గేమ్స్, స్పోర్ట్స్ మెడిసిన్, స్పోర్ట్స్ న్యూట్రిషన్ ఇలా ఏ రంగం లోనైనా భారతదేశం వేగంగా దూసుకుపోతోంది. 2036లో ఒలింపిక్స్‌కు ఆతిథ్యం ఇచ్చేందుకు మనం కూడా పోటీపడు తున్నాం. 2030లో కామన్వెల్త్ క్రీడలకు ఆతిథ్యం ఇస్తు న్నాం. ఒలింపిక్స్‌లో దాదాపు 40 క్రీడాంశాలు, సుమారు 350 ఈవెంట్లు ఉంటాయి. అయితే చాలా క్రీడల్లో కనీస అర్హత సాధించలేక పోతున్నందున.. మూడింట రెండొంతుల గేమ్స్‌లో మనం పోటీ కూడా పడలేకపోతున్నాం. 2036లో మనం కనీసం మూడు వంతుల ఈవెంట్లలో పాల్గొనాలని నిర్ణయించుకున్నాం. టాలెంట్ హంట్‌తో దేశంలోని ప్రతిచోట నుంచి 5 నుంచి 15 ఏళ్ల వయసు గల ప్రతిభావంతులను గుర్తిస్తాం. వారు ప్రత్యేక శిక్షణ పొందుతారు' అని మోదీ వెల్లడించారు.

## భారత్‌కు ప్రపంచస్థాయి నాయకత్వ లక్షణం

- సత్తా చాటగల నైపుణ్యాలు మన సొంతం
- యువత ఓ గంట సమయం కేటాయిస్తే చాలు
- జనగణనలో ఖచ్చితమైన సమాచారం ఇవ్వండి
- దానితోనే దేశ అభివృద్ధి ప్రణాళికలు రచించగలం
- ఎర్రకోట నుంచి ప్రధాని మోడీ పిలుపు
- ఎర్రకోట వేడుకలకు దూరంగా రాహుల్, ఖర్గే



న్యూఢిల్లీ,ఆగస్ట్15 : భారత్‌కు ప్రపంచస్థాయి నాయకత్వ లక్షణాలు ఉన్నాయని, అన్నిరంగాల్లో దూసుకుపోయే సమర్థత ఉందని ప్రధాని మోడీ అన్నారు. సవాళ్లు స్వీకరించి ముందుకు సాగడం ద్వారా మనమేంటో సత్తా చూపగలమన్నారు. ఎర్రకోట వేదికగా ప్రధాని మోదీ యువత లక్ష్యంగా పలు కార్యక్రమాలను ప్రకటించారు. కోటి మంది యువతకు ఏఐ నైపుణ్యాలలో శిక్షణ ఇస్తామని, పోటీ పరీక్షలకు ఉచిత ఆన్‌లైన్ కోచింగ్ అంది స్తామన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలపై ఉన్న ఆర్థిక భారాన్ని తగ్గించడమే.. ఉచిత కోచింగ్ కార్యక్రమ లక్ష్యమని చెప్పారు. అలాగే ప్రస్తుతం దేశంలో జరుగుతోన్న జనగణన గురించి ప్రస్తావించారు. దానిలో యువత చురుగ్గా పాల్గొనాలని మోదీ పిలుపునిచ్చారు.'నేను అందరినీ ఒక ఫేవర్ చేయాలని అడుగుతున్నాను. ఒక గంటా, రెండు గంటల సమయం కేటాయించండి. అది దేశానికి ఎంతో ఉపయోగపడుతుంది. ఆ మాత్రం సమయం దేశాన్ని ఎలా బలోపేతం చేస్తుందా..? అని యువత ఆలోచిస్తూ ఉండొచ్చు. వారి భాగస్వామ్యంతో ప్రతి ఇంట్లో జనాభా గణనకు ఒక అనుకూల వాతావరణం ఏర్పడేందుకు అవకాశం ఉంటుంది. గణన అంటే లెక్కలన్నీ ఒక దగ్గర రాసుకోవడం కాదు. జనాభా లెక్కల సమయంలో ప్రజలు ఇచ్చే వివరాల ఆధారంగానే జాతీయ విధానాలు, పథకాలు రూపుదిద్దుకుంటాయి. దేశ ప్రగతికి ఆ లెక్కలు సూచీగా ఉంటాయి. అందుకే కచ్చితమైన, స్పష్టమైన సమాచారం ఇవ్వడం అత్యంత కీలకం అని మోదీ పేర్కొన్నారు. అలాగే 'దిమాగీ నక్సల్స్' గురించి మాట్లాడుతూ.. వారిని దేశానికి కొత్త శత్రువులుగా అభివర్ణించారు. 'సంవత్సరాలుగా మావోయిస్టు భావజాలం ఉన్న వ్యక్తులు దేశంలో బలంగా పాతుకుపోయారు. అడవుల్లోని సాయుధ నక్సల్స్‌ను నిర్మూలించి, ఆ సంక్షోభం నుంచి దేశాన్ని విముక్తి చేయడంలో ప్రభుత్వం విజయం సాధించింది. సాయుధ నక్సల్స్ కనుమరుగైనా.. 'దిమాగీ నక్సల్స్' మిగిలి ఉన్నారు. వారు ఒక అవకాశం కోసం ఎదురు చూస్తున్నారు. సమాజాన్ని తప్పుడు మార్గంలోకి లాగడానికి వారు కొత్త ఎత్తుగడలు వేస్తున్నారు. మనం వారిని గుర్తించి.. ఏకాకిని చేయాలని సూచించారు. తయారీ, వ్యవసాయం, సాంకేతికత, మౌలిక సదుపాయాలు, రక్షణ రంగం, గ్రీన్ అండ్ బ్లూ ఎకానమీ, ఇండియాస్ సాఫ్ట్ పవర్ కోసం 'సప్తధార' రోడ్‌మ్యాప్‌ను మోదీ ప్రకటించారు. మహిళా కోటా బిల్లుపై ప్రతిష్టంభన నెలకొన్న నేపథ్యంలో.. తన ప్రసంగంలో దాని ప్రస్తావన తీసుకువచ్చారు. ప్రతిపక్షాలు విభేదాలను పక్కనపెట్టి.. పార్లమెంట్, శాసనసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు సహకరించాలని కోరారు. క్రెడిట్ వారే తీసుకున్నా ఫర్వాలేదని, కానీ బిల్లు పాసయి మహిళలకు గౌరవం దక్కాలన్నదే తన ఆకాంక్ష అన్నారు. భారత్ ఇకపై చిన్న కలలతో ముందుకు వెళ్లలేదని, ఆలోచనా పరిధి విస్తృతం చేసుకునేందుకు ఉన్నత లక్ష్యాలు అవసరమని మోదీ పిలుపునిచ్చారు. భారతదేశం అభివృద్ధి చెందిన దేశంగా మారినప్పుడు ప్రపంచం మన వైపు చూసే తీరే మారుతుందని పేర్కొన్నారు. ఇతర దేశాలపై ఆధారడి జీవించలేమని, స్వయం సమృద్ధి సాధించాలన్నారు. టెక్ ప్రపంచంలో చిప్‌ల విలువను భారతదేశం అర్థం చేసుకుంటోందని, అందుకే మూడు సెమీకండక్టర్ ప్లాంట్లను ఏర్పాటు చేసిందని తెలిపారు. సమీప భవిష్యత్తులో మరిన్ని సెమీకండక్టర్ ప్లాంట్లను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఇప్పుడు ప్రతిభారతీయుడు స్థానిక ఉత్పత్తులకు మద్దతు ఇవ్వడంపై సంతోషం వ్యక్తంచేశారు. తమ ప్రభుత్వ హయాంలో 25 కోట్లమంది పేదరికం నుంచి బయటపడ్డారని తెలిపారు. అభివృద్ధి దిశగా దృఢ సంకల్పంతో పయనిస్తోన్న 140 కోట్ల మంది భారతీయులను ఆపడం అసాధ్యం అని పేర్కొన్నారు. దేశంలోని పలు ప్రాంతాల్లో ఇటీవల సంభవించిన విపత్తుల గురించి ప్రస్తావించారు. బాధిత కుటుంబాలకు దేశం మొత్తం అండగా ఉంటుందని సంఘీభావం తెలిపారు. దేశంలో 70 నగరాల్లో పైప్‌లైన్ ద్వారా గ్యాస్ అందిస్తున్నాం. 1.75 కోట్ల ఇళ్లకు పైప్ ద్వారా వంటగ్యాస్ సరఫరా చేస్తున్నాం. ఇంధన భద్రత సాధించడం దేశ తక్షణ అవసరం. వంద గిగావాట్ల అణు ఇంధనం సాధించడం మనలక్ష్యం అన్నారు. ఇటవలే హైడ్రోజన్ రైలును విజయంతంగా నడిపించాం. 90 ఏళ్లలో 30 శాతం మాత్రమే రైళ్ల ఎలక్ట్రిఫికేషన్ జరిగింది. 10 ఏళ్లలో 70 శాతం రైళ్ల ఎలక్ట్రిఫికేషన్ పూర్తి చేశాం. ఇటీవలే హైడ్రోజన్ రైలును విజయవంతంగా నడిపించామని అన్నారు. 50 లక్షల ఇళ్లకు సౌరశక్తి విద్యుత్ అందిస్తున్నాం. దేశంలో ఐదు న్యూక్లియర్ రియాక్టర్లు ఏర్పాటు చేస్తున్నామని మోదీ తెలిపారు.అయితే స్వాతంత్ర్య వేడుకల్లో ఈసారి కూడా లోక్‌సభ, రాజ్యసభల్లో విపక్ష నేతలు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే హాజరుకాలేదు. సీటింగ్, ఇతర ప్రొటోకాల్స్ వారి పదవులకు అనుగుణంగా ఉండటం లేదని కాంగ్రెస్ గతంలో ఆరోపించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే వారు వరుసగా రెండోసారి గైర్హాజరయ్యారు.

## ఎర్రకోటపై జెండా ఎగరేసిన ప్రధాని మోడీ

- వరుసగా 13వసారి జెండా ఆవిష్కరణ
- తొలిసారిగా పూర్తిస్థాయి వందేమాతర గీతాలపన
- పూలవర్షం కురిపించిన వాయుసేన హెలికాప్టర్లు

న్యూఢిల్లీ,ఆగస్ట్15 : దేశవ్యాప్తంగా 80వ స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. రాజధాని ఢిల్లీలో ఎర్రకోటపై ప్రధాని మోదీ జాతీయ జెండా ఎగురవేశారు. ఢిల్లీలోని ఎర్రకోటపై మోదీ వరుసగా 13వ సారి జాతీయ జెండా ఎగురవేశారు. దేశ చరి త్రలో తొలిసారిగా వందేమాతరం గేయాన్ని పూర్తిగా ఈ వేడుకల్లో ఆలపించారు. అనంతరం జాతీయ గీతం'జనగణమన'ను ఆలపించారు. ఆ సమ యం లోవాయుసేన పూలవర్షం కురిపించింది. ఒక హెలి కాప్టర్‌జాతీయపతాకాన్ని.. మరొకటి 'వందే మాతరం' అని రాసి ఉన్న జెండాను మోసుకెళ్లాయి. 'వందేమాతరం' గేయానికి 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా గతేడాది నవంబర్ 7 నుంచి ఏడాది పాటు కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు జరుగుతోన్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే జాతీయ గీతం 'జనగణ మన'తో పాటు వందేమాతరానికి ప్రభుత్వం సమాన హోదా కల్పి స్తూచట్టంచేసింది. ఈ చట్టం ప్రకారం.. 'వందేమా తరం'ని అవమానించినా, ఆలపిస్తున్న సమయంలో ఆటంకం కలిగించినా ఇకపై చట్టరీ త్యా నేరంగా పరిగణిస్తారు.స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ ప్రముఖ సెర్చ్ ఇంజిన్ సంస్థ గూగుల్ ప్రత్యేక డూడుల్‌ను రూపొందించింది. ఇది భారతీ య వస్త్రకళలు, సంస్కృతీ సంప్రదా యాలు, వైవిధ్యా న్ని చాటిచెబుతోంది. 22 విభిన్న ప్రాంతీయ వస్త్ర సంప్రదాయాలను తెలియ జేసే డిజైన్‌లు అందులో కనిపిస్తున్నాయి. చేతితో నేసిన ఈ వస్త్రాల డూడుల్ దేశవ్యాప్తంగాఉన్ననేత కార్మికులు, రైతులు, బ్లాక్-ప్రింటర్ల సామూహిక శ్రమను ప్రతిబింబిస్తోంది.

## బేగంబజార్‌లో సోనూసూద్ సందడి

హైదరాబాద్,ఆగస్ట్15 : భగత్‌సింగ్ యువసేన రాష్ట్ర అధ్యక్షుడు లడ్డు యాదవ్ ఆధ్వర్యంలో శనివారం భారీ తిరంగా బైక్ ర్యాలీని నగరంలో నిర్వహించారు. ఈ ర్యాలీలో ప్రముఖ బాలివుడ్ నటులు సోను సూద్ పాల్గొన్నారు. బేగంబజార్ ఛత్రి చౌరస్తాలో ఏర్పాటు చేసిన స్వాగత వేదికపై సోను సూద్ మాట్లాడారు. బేగంబజార్‌తో తనకు ఎంతో అనుబంధం ఉందని పేర్కొన్నారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండేలా అవగాహన కల్పించాలని కోరారు. అవసరమైతే ఆదుకునేందుకు తాను సిద్ధమని స్పష్టం చేశారు. లడ్డు యాదవ్ ఆధ్వర్యంలో తిరంగా బైక్‌ర్యాలీ నిర్వహించడం, భారీ సంఖ్యలో యువత తరలి రావడం ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా పలువురు వికలాంగులకు వీల్ చైర్‌లు, అనాథ విద్యార్థులకు పాఠశాల బ్యాగులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పవన్‌సింగ్, అజయ్ అగర్వాల్, రోమల్ సింగ్, దినేష్ యాదవ్, గురుసింది తదితరులు పాల్గొన్నారు.

## రాజగోపాల్ వ్యాఖ్యల్లో తప్ప లేదు : అనిరుధ్ రెడ్డి

హైదరాబాద్,ఆగస్ట్15 : మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యలను సమర్థిస్తూ మరో కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అనే వ్యక్తి ఒక అగ్నిపర్వతం.. వోల్కానో.. ఆయనకు కోపమొచ్చిందంటే ఒక అగ్నిపర్వతం పేలినట్టు పేలుతది. ఆయన ఎప్పుడూ కూడా మంత్రి పదవి కావాలని కొట్లాడలేదు.. అడగలేదు.. రెండున్నర సంవత్సరాలు అయింది.. అయి ఉంటే అప్పుడే కొట్లాడుతుండే. ఆయన ప్రజల గురించి సమస్యల మీద అడుగుతుండు. రాజగోపాల్ రెడ్డి మాట్లాడే దాంట్లో తప్పేం లేదు. నేను కూడా సమస్యల గురించి చాలా సార్లు మాట్లాడాను. సమస్యలున్నాయి.. వాటిని పరిష్కరించుకుంటే మా పార్టీకే మంచి పేరొస్తది కదా..కాంగ్రెస్ పార్టీకి మంచి పేరు రావాలని మాట్లాడిండు అన్నారు. ఇప్పుడీ కామెంట్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి.

## జగ్గారెడ్డి హనుమంతుడి లాంటి వాడు

### సిఎం రేవంత్ ఆసక్తికర వ్యాఖ్యలు



సంగారెడ్డి,ఆగస్ట్15 : జగ్గారెడ్డి లాంటి ప్రజాప్రతినిధిని దూరం చేసుకోవడం ప్రజలు చేసుకున్న దురదృష్టమని సిఎం రేవంత్ అన్నారు. పదవులతో సంబంధం లేకుండా ప్రజల్లో ఉండే నేత జగ్గారెడ్డి అని ప్రశంసించారు. కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభోత్సవ కార్యక్రమం సందర్భంగా సంగారెడ్డిలో సీఎం రేవంత్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తన ప్రసంగం ముగించే సమయంలో సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డిపై ప్రశంసలు కురిపించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ రాముడైతే.. జగ్గారెడ్డి హనుమంతుడులాంటి వారని వ్యాఖ్యానించారు. ఓడిపోయినా ప్రజల మధ్యే జగ్గారెడ్డి తిరుగుతున్నారంటూ ప్రశంసించారు. రూ.వెయ్యి కోట్లు ఇచ్చినా జగ్గారెడ్డి లాంటి నాయకుడు దొరకరు. ఆయన్ను ఓడించడం మీ దురదృష్టం. కుటుంబాన్ని కూడా వదిలేసి ప్రజల కోసం తిరిగే నేత. నాయకులకు మార్కులు వేస్తే.. నాకన్నా మంచి మార్కులు జగ్గారెడ్డికే వస్తాయి. ఇక్కడేం జరుగుతుందో నాకు తెలియదు గానీ.. జగ్గారెడ్డి ప్రజాజీవితంలో ఉండాలి'అని సీఎం వ్యాఖ్యానించారు.

## జ్వరంతో బాధపడుతున్న పవన్ కళ్యాణ్

అమరావతి,ఆగస్ట్15 : ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అనారోగ్యానికి గురయ్యారు. తీవ్ర జ్వరంతో ఆయన బాధపడుతున్నారు. ఈ మేరకు శనివారం సాయంత్రం విజయవాడ లోక్‌భవన్‌లో గవర్నర్ అబ్దుల్ నజీర్ నిర్వహించిన 'ఎట్ హోమ్' కార్యక్రమానికి గైర్హాజరయ్యారు. స్వాతంత్ర్య దినోత్సవం వేళ ఈరోజు ఉదయం కాకినాడలో నిర్వహించిన 80వ పంద్రాగస్టు వేడుకల్లో డిప్యూటీ సీఎం పవన్ పాల్గొన్నారు. అనంతరం రాజమహేంద్రవరంలో అటవీశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సెంట్రల్ క్రాఫ్ట్ వుడ్ బ్యాంక్‌ను పవన్ ప్రారంభించారు. ఈ సమయంలో జ్వరం తీవ్రం కావడంతో కార్యక్రమాన్ని మధ్యలోనే ముగించారు. వైద్యులు ప్రాథమిక చికిత్స చేయడంతో ఉప ముఖ్యమంత్రికి కొంత ఉపశమనం కలిగింది. అనంతరం ఆయన హైదరాబాద్‌కు బయలుదేరి వెళ్లారు. ఈ కారణంగానే 'ఎట్ హోమ్' కార్యక్రమానికి గైర్హాజరయ్యారు. ఈ విషయాన్ని లోక్‌భవన్ అధికారులకు డిప్యూటీ సీఎం పేషీ తెలియజేసింది. కాగా, ఇటీవల పవన్ తన కుడి భుజానికి శస్త్రచికిత్స చేయించుకున్న సంగతి తెలిసిందే.

# సంపాదకీయం

## హుందాతనం కోల్పోతున్న రాహుల్ !

రాజకీయాల్లో హుందాతనం అవసరం. సమయానుకూలంగా మంచిగా మాట్లాడేలా వ్యవహరించాలి. సమస్యలపై అవగాహన ఉండాలి. అందులోనూ ప్రతిపక్షనేతగా ఉన్న వ్యక్తికి ఇవన్నీ అవసరం. ప్రతిపక్ష నేతగా సమర్థత ఉంటేనే రాణిస్తారు. అధికారంలో ఉన్నప్పుడు ఎలాగైనా చెల్లుతుంది. కానీ ప్రతిపక్షనేతగా రాణించాలంటే ప్రజల్లో తన వ్యక్తిత్వం కూడా పెంచుకోవాల్సి ఉంటుంది. మాటలు, చేతలు అన్నీ హుందాగా ఉండేలా చూసుకోవాల్సి ఉంటుంది. లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్ ఈ మధ్య మరీ దిగజారి పోయారు. మాటల్లో హుందాతనం లేదు. చేతల్లో అంతకన్నా లేకుండా పోయింది. సర్కస్‌లో జోకర్‌లా, డ్రామాల్లో విదూషకుడిలా ఆయన ప్రవర్తిస్తున్న తీరు జుగుప్స కలిగిస్తోంది. లోక్‌సభలో మాట్లాడాల్సిన సమయంలో మాట్లాడరు. మాట్లాడితే పస ఉండడం లేదు. సమస్యలపై అవగాహన ఉండడం లేదు. విషయంపై పట్టు ఉండడం లేదు. ఇవన్నీ కలగలిపి రాహుల్ గాంధీ విపక్ష నేతగా పూర్తిగా విఫలం అవుతూ వస్తున్నారు. ఇటీవల వరుసగా పార్లమెంట్ సమావేశాలు దెబ్బతినడానికి ప్రధాన కారణం కూడా రాహుల్ అన్న విషయం మరచిపోరాదు. తాజాగా ఆయన చేసిన వ్యాఖ్యలు ఆయన ఎంతగా దిగజారిపోయారో అనడానికి నిదర్శనంగా నిలిచాయి. ఆలింగనాలే ప్రధాన మంత్రి మోదీ విదేశీ దౌత్యం అంటూ... లోక్‌సభ విపక్ష నేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు..ఆయన ఆహార్యం సామాన్యులకు కూడా వెగటు పుట్టించేలా ఉన్నాయి. అహంకారం హద్దులు దాటి రాహుల్ నోరుజారుతున్నారనడానికి ఇంతకన్నా నిదర్శం అక్కర్లేదు. ఇది ఓ రకంగా భారత ప్రతిష్ఠను దిగజార్చేలా ఉంది. ఇలాంటి ప్రతిపక్ష నేతను గతంలో ఎప్పుడూ చూడలేదని రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ చేసిన వ్యాఖ్యలు ముమ్మాటికీ నిజం. ఎందుకంటే భారత దౌత్యంపై రాహుల్ చేసినవి దిగజారుడు వ్యాఖ్యలు చూశాక ఇలాంటి ప్రతిపక్ష నేత ఉన్నందుకు దేశ ప్రజలు సిగ్గుపడాలి. ఆయన ప్రవర్తన ఆరోగ్యకరమైన ప్రజాస్వామ్యానికి ప్రమాదకరం. రాహుల్ వ్యాఖ్యలు విదేశాల్లో భారత్ ప్రతిష్ఠను దిగజార్చేలా ఉన్నాయి. ఎందుకంటే రాహుల్ అహంకారంతో చేసిన వ్యాఖ్యలు వ్యవహరించిన తీరు పిచ్చిగా మారుతోందనడానికి చెప్పడానికి సిగ్గుపడాల్సిన పనిలేదు. భావి భారత ప్రధాని అని కాంగ్రెస్ శ్రేణులంతా పొగడుతున్న వేళ..ఆయన భాషను, ఆహార్యాన్ని చూస్తుంటే..ఇతనూ ఒక నేతేనా అన్న సందేహం కలుగక మానదు. ఇలాంటి వారిచేతిలో భారత్ పదిలంగా ఉండగలదా అన్న భయం కలుగుతోంది. భారతదేశాన్ని నడపడానికి సుదీర్ఘ అనుభవం కావాలి. పనికిమాలిన నాటకాలు కాదు. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాన్ని జోకర్లని పిలవడం, మోడీని, అమిత్ షాలను కట్టగట్టి తిట్టడం పరిధికి మించిన విషయం. రాహుల్ వాడుతోన్న భాష మూర్ఖత్వాన్ని, నిరాశను తెలిజేస్తున్నాయి. ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీని ఉద్దేశించి రాహుల్ చేసిన వ్యాఖ్యలు దిగజారుడు రాజకీయాలకు పరాకాష్టగా చెప్పుకోవాలి. అలాగే విదేశాల్లో వివిధ నేతలతో మోడీ ఆలింగనాలపైనా కువ్యాఖ్యలు చేశారు. నిజానికి ఓ ప్రతిపక్షనేతగా ఉన్న వ్యక్తి విదేశీ నాయకులపై రాజకీయ వ్యాఖ్యలు చేసేటప్పుడు గౌరవప్రదమైన వైఖరి ప్రదర్శించాల్సి ఉంటుంది. తానొక విపక్షనేతను అన్నది మరచి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ఆయన దిగజారుడు రాజకీయాలకు పారాకాష్టగా చూడాలి. రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్ర తరవాత ఆయన నాయకత్వం పట్ల ప్రజల్లో కొంత విశ్వసనీయతను పెంపొందించిందనడంలో సందేహం లేదు. ఆ యాత్రతో ఆయన ప్రజల మనిషిగా మారడానికి తపించారు. అయితే సార్వత్రిక ఎన్నికల అనంతరం కాంగ్రెస్‌ను మళ్లీ ఒక కుటుంబ వ్యవస్థగా మార్చేయడంతో భారత్ జోడో యాత్ర నాటి ఆదర్శం లేకుండా పోయింది. ఇప్పుడు జన్‌జి అంటూ మాట్లాడుతున్న రాహుల్ వారికి పార్టీలో అవకాశం ఇవ్వలేక పోయారు. ప్రియాంకగాంధీని వయనాడ్ నుంచి లోక్‌సభకు ఎన్నిక చేయించుకున్నారు. తల్లి సోనియాను రాజ్యసభకు పంపారు. తాను రాయబరేలి నుంచి ఎన్నికయ్యారు. ఇది కుటుంబ పార్టీ అనకుండా ఎలా ఉండగలం. వృద్ధనేతలంతా కాంగ్రెస్‌లో పాతుకు పోయారు. యువ నేతలను దరిచేరనీయకుండా చూసుకుంటున్నారు. వీరు జన్‌జీ గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉంది. తాను దక్షిణాదికి ప్రాతినిధ్యం వహిస్తున్నానని, తన సోదరుడు ఉత్తరాదికి ప్రాతినిధ్యం వహిస్తున్నాడని, తద్వారా తాము ఈ సువిశాల దేశాన్ని సమైక్యం చేస్తున్నామని ప్రియాంక చెప్పుకోవడం సిగ్గుచేటు. 2024 సార్వత్రిక ఎన్నికలలో 99 సీట్లు గెలుచుకుని కాంగ్రెస్ ప్రధాన ప్రతిపక్షంగా ఆవిర్భవించడంతో రాహుల్ విధేయులు ఆయనను కాబోయే ప్రధానమంత్రి అని కీర్తించడం ప్రారంభించారు. కొందరు మేధావులు, పాత్రికేయులు కూడా ఆ కీర్తనకు వంతపాడుతూ వచ్చారు. రెండు సంవత్సరాల తరువాత ఇప్పుడు వెనుతిరిగి చూస్తే అంత సీన్ రాహుల్‌కు లేదని అనిపిస్తోంది. తాజాగా రాహుల్ చేష్టలు, వ్యాఖ్యలు ఆయనలో నాయకత్వ పటిమ లేదని నిరూపించాయి. దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాల్లో కాంగ్రెస్ క్రమంగా వెనుకపడిపోతోంది. కాంగ్రెస్ పతనాన్ని రాహుల్‌గాంధీ నిలువరించలేక పోతున్నారు. ప్రధానమంత్రి పదవి విషయంలో నరేంద్ర మోదీతో పోలిస్తే .. రాహుల్‌లో క్రమశిక్షణ, హుందాతనం, విద్యార్హతలు, నాయకత్వ నైపుణ్యాలు ఎక్కడా కనిపించవు. సమయానుకూలంగా ఏదో ఓ సమస్యపై మాట్లాడడం, విదేశాలకు చెక్కేయడం అలవాటు చేసుకున్నారు. అక్కడా భారత పరువు పోయేలా మాట్లాడడం కూడా అలవాటు చేసుకున్నారు. 'ఓటు చోరీ'పై ఇలాగే చేశారు. ప్రతిపక్ష నేతగా ప్రధాని కన్నా ఎక్కువ కష్టపడాలి. ఎక్కువగా కృషి చేయాలి. యూపీఏ అధికారంలో ఉన్న పది సంవత్సరాలలో రాహుల్ మంత్రిపదవిని చేపట్టేందుకు అంగీకరించలేదు. దీంతో ఆయనకు అధికారంలో ఉండడం ఎలా అన్నది కూడా తెలియదు. ప్రస్తుత కల్లోల అంతర్జాతీయ పరిస్థితులలో ఈ సువిశాల దేశానికి ప్రభావశీల ప్రధానమంత్రి కాగలరని భారతీయ ఓటర్లు మాత్రం ఎలా నమ్ముతారు. గతంలో చేసిన తప్పుల నుంచి పాఠాలు నేర్చుకోలేని రాహుల్, ఇప్పటికీ పదేపదే అవే తప్పులు చేయడంతో పాటు, రాజకీయ హుందాను కోల్పోతున్నారు. 2019లో మోదీకి వ్యతిరేకంగా రాహుల్ నిర్వహించిన 'చౌకీదార్ చోర్' ప్రచారం ఘోరంగా విఫలమవడమే కాకుండా కాంగ్రెస్‌నే ఎదురు దెబ్బతీసింది. అయినప్పటికీ పాలనా వైఫల్యాలు లేదా తన సొంత పార్టీని గ్రామస్థాయి నుంచి పటిష్ఠం చేయడంపై దృష్టి పెట్టకుండా ప్రధాన మంత్రిపై వ్యక్తిగత విమర్శలు చేయడం ద్వారా మరింతగా దిగజారిన నేతగా ప్రజల్లో చులకన భావం మూటకట్టుకుంటున్నారు. ఇలాంటి వ్యక్తి నిజసానికి ప్రతిపక్ష నేతగా కూడా పనికిరాడు. ఇక ప్రధానిగా కావాలనుకంటున్న ఇతనికి వందిమాగధులు చేస్తున్న పొగడ్తలతో ఉబ్బిపోవడం తప్ప మరోటి తెలియడం లేదు. స్వయం ప్రకటితంగా ఇక తానే భావి ప్రధాని అనుకోవడంతో వచ్చిన మానసిక వైకల్యంగా చూడాలి. వీటిని అధిగమించితే తప్ప సమర్థనేతగా రాహుల్ రాణించడం కష్టం.

## స్వేచ్ఛ, సామాజిక న్యాయానికి పెద్దపీట

### సిద్దిపేటలో జెండా ఆవిష్కరణలో పొన్నం

### గౌడవెల్లి ప్రాజెక్టును పూర్తి చేస్తామని హామీ








సిద్దిపేట,ఆగస్ట్15 : ప్రజాపాలన, పారదర్శక పాలనలో స్వేచ్ఛా, సామాజిక న్యాయం, సమాన అవకాశాలు అందించాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సిద్దిపేటలో జెండా ఆవిష్కరణ చేసిన అనంతరం మాట్లాడారు. 80 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ లోని పెరేడ్ గ్రౌండ్స్ లో జాతీయ జెండా ఎగురవేయడం జరిగింది.నంతరం పోలీసుల గౌరవ వందనం స్వీకరించి పెరేడ్ పర్యవేక్షించారు. స్వతంత్ర సమరయోధులను గౌరవించి సత్కరించి, నంతరం ఏర్పాటు చేసిన వివిధ విభాగాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్ పరిశీలించడం జరిగింది.మెప్మా ఆధ్వర్యంలో 64 మహిళా సంఘాలకు 9 కోట్ల 25 లక్షల రూపాయల చెక్కును అందించి, 821 బఠణ లకు 78 కోట్ల రూపాయల చెక్కును అందించి, జిలాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందజేయడం జరిగింది. ఇకపోతే హుస్నాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో గౌరవెల్లి పూర్తి చేసే బాధ్యత నాదే.. పూర్తి చేయకపోయినా బాధ్యత నాదేనని అన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గ ప్రజల చిరకాల స్వప్నమైన గౌరవెల్లి ప్రాజెక్టును పూర్తి చేసి తీరే బాధ్యత నాదే. ప్రాజెక్టును పూర్తి చేయడంలో ఏ చిన్న జాప్యం జరిగినా ఆ బాధ్యత కూడా నాదే. హుస్నాబాద్ ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడానికి చివరి వరకు కృషి చేస్తాను. గత పదేళ్లు అధికారంలో ఉన్న వారు గౌరవెల్లి ప్రాజెక్టును పూర్తి చేస్తామని ఎన్నో హామీలు ఇచ్చారు. అయినా ప్రాజెక్టు ఎందుకు పూర్తి కాలేదో మాజీ ఎమ్మెల్యే సతీష్ బాబు ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. కుర్చీ వేసుకుని గౌరవెల్లి ప్రాజెక్టును పూర్తి చేస్తామని చెప్పిన మీ నాయకుడు అర్ధరాత్రి దాడులు చేయించి ఎక్కడికి వెళ్లారు? పదేళ్లు అధికారంలో ఉండి ఎందుకు పూర్తి చేయలేకపోయారు?' అని నేను ప్రశ్నిస్తున్నాను. గౌరవెల్లి ప్రాజెక్టు పనుల్లో కీలకమైన కాలువల భూసేకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.237 కోట్లు విడుదల చేసింది. ప్రాజెక్టును పూర్తి చేయడంపై ప్రజా ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి ఇదే నిదర్శనం. గౌరవెల్లి ప్రాజెక్టుకు సంబంధించిన పర్యావరణ అనుమతులపై గతంలో ఏర్పడిన సమస్యలకు సంబంధించి గ్రీన్ ట్రిబ్యునల్‌లో కేసులు వేసింది రాజకీయ పార్టీ నాయకులు కాదు.. ప్రజలే న్యాయపరమైన పోరాటం చేశారు. గతంలో ఇచ్చిన పర్యావరణ అనుమతులు కొనసాగిస్తూ ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు కూడా రాజకీయ విమర్శలు చేసే వారికి కనిపించడం లేదా అన్నారు. గౌరవెల్లి ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతూ, అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు కనిపించకుండా కేవలం రాజకీయ విమర్శలు చేయడం సరికాదు. హుస్నాబాద్ నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయి.స్నాబాద్‌లో నిర్మాణమవుతున్న శాతవాహన యూనివర్సిటీ ఇంజినీరింగ్ కాలేజీ, 250 పడకల ఆసుపత్రి, పీజీ మెడికల్ కాలేజీ మంజూరు, తంగళ్లపల్లిలో నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్, హుస్నాబాద్?కరీంనగర్ ఫోర్‌లేన్ రహదారి, అక్కన్నపేట?హుస్నాబాద్ ఫోర్‌లేన్ రహదారి, కొత్తచెరువు?ఫ్లలెచెరువు పునరుద్ధరణ పనులు, తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ వంటి అభివృద్ధి కార్యక్రమాలు మాజీ ఎమ్మెల్యేకు కనిపించడం లేదా అన్నారు. నిరంతరం హుజురాబాద్‌లోని మీ కాలేజీకి, అటు హనుమకొండకు వస్తూ పోతున్న మాజీ ఎమ్మెల్యేకు ఎల్కతుర్తి జంక్షన్ అభివృద్ధి కూడా కనిపించడం లేదా? హుస్నాబాద్ అభివృద్ధిని చూసి ఓర్వలేకే కొందరు రాజకీయ విమర్శలు చేస్తున్నారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు, విద్య, వైద్యం, రహదారులు, సాగునీటి ప్రాజెక్టులపై నిర్మాణాత్మకంగా మాట్లాడాలి. ÷-వాతంత్ర్య దినోత్సవం రోజున కూడా రాజకీయ విమర్శలకు దిగడం సరికాదు. దేశ స్వాతంత్య్రం కోసం త్యాగాలు చేసిన మహనీయులను స్మరించుకోవాల్సిన పవిత్రమైన రోజున ప్రజా సమస్యలు, అభివృద్ధి అంశాలపై నిర్మాణాత్మకంగా మాట్లాడాలి. హుస్నాబాద్ ప్రజలు రాజకీయ ఆరోపణలు, విమర్శలు కోరుకోవడం లేదు.. అభివృద్ధిని కోరుకుంటున్నారు. గతంలో చేయలేకపోయిన పనులను ప్రజా ప్రభుత్వం ఒక్కొక్కటిగా పూర్తి చేస్తోంది. గౌరవెల్లి ప్రాజెక్టును పూర్తి చేయడంతో పాటు హుస్నాబాద్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి నా వంతు కృషి నిరంతరం కొనసాగు తుంది. బగౌరవెల్లి పూర్తి చేసే బాధ్యత నాదే.. పూర్తి చేయకపో యినా ఆ బాధ్యత కూడా నాదే. హుస్నాబాద్ ప్రజలకు ఇచ్చిన మా టను నిలబెట్టుకోవడానికి



చివరి వరకు కృషి చేస్తానని అన్నారు.

## దేశ భవిష్యత్ ప్రగతికి సరికొత్త దిశానిర్దేశం



- ఆయా రంగాల్లో స్వయంసమృద్ధితో వికసిత భారత్ సాధ్యం
- ఆర్థిక,సామాజిక ఎదుగుదలకు చోదకశక్తి కావడం తథ్యం

### సప్తధార సందేశం ఇచ్చిన ప్రధాని నరేద్ర మోడీ

న్యూఢిల్లీ, ఆగస్టు 15 : భారతదేశ 80వ స్వాతంత్య దినోత్సవం సందర్భంగా ఎర్రకోట వేదికగా ప్రధాని నరేంద్ర మోడీ చేసిన ప్రసంగం దేశ భవిష్యత్తు ప్రగతికి సరికొత్త దిశానిర్దేశం చేసింది. 2047 నాటికి 'వికసిత్ భారత్', స్వయంసమృద్ధి సాధించడమే లక్ష్యంగా, దేశాన్ని నడిపించే ఏడు ప్రాథమిక శక్తులను 'సప్తధార' పేరుతో ఆయన ఆవిష్కరించారు. ఈ ఏడు రంగాలు భారతదేశ రాబోయే ఆర్థిక, సామాజిక ఎదుగుదలకు చోదక శక్తులుగా నిలుస్తాయని పేర్కొన్నారు. మొదటి ధార మాన్యుఫ్యాక్చరింగ్. దేశ తదుపరి వృద్ధి దశకు మాన్యుఫ్యాక్చరింగ్ బలమైన పునాదిగా మోడీ అభివర్ణించారు. కేవలం చిన్న విడిభాగాల తయారీకే పరిమితం కాకుండా సంపూర్ణ ఉత్పత్తుల తయారీపై భారత్ దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. ప్రపంచ సరఫరా వ్యవస్థలో భారత్‌ను ఒక కీలక భాగస్వామిగా నిలబెట్టేందుకు ధర, నాణ్యత, విస్తృత స్థాయి ఉత్పత్తి అనే మూడు అంశాలపై తయారీదారులు దృష్టి పెట్టాలని సూచించారు. మన ఉత్పత్తులకు ఆకర్షణీయమైన ప్యాకేజింగ్, ఖచ్చితత్వంతో కూడిన నాణ్యత ఐడెంటిటీగా మారాలని చెప్పారు. సప్తధారలో రెండవది వ్యవసాయం, ఆహార భద్రత. దేశ అభివృద్ధి ప్రయాణంలో వ్యవసాయ రంగ ప్రాధాన్యతను నొక్కి చెప్పిన ప్రధాని, ఆర్థిక వృద్ధిలో ఆహార ఉత్పత్తి, వ్యవసాయం ఎప్పటికీ కేంద్రబిందువులుగా ఉంటాయని స్పష్టం చేశారు. సుదీర్ఘకాల ఆహార భద్రతను నిర్ధారించడానికి వ్యవసాయరంగాన్ని బలోపేతంచేసి, ఉత్పాదకతను పెంచాల్సిన అవసరం ఉందన్నారు. సాంకేతికత, ఆవిష్కరణలు మూడవ ధారగా అభివర్ణించారు. ప్రపంచం డేటాసెంటర్లు, రోబోటిక్స్, సరికొత్త సాంకేతికతల యుగంలోకి అడుగు పెడుతోందని, ఈ రంగాల్లో భారత్ గ్లోబల్ హబ్‌గా మారాలని పిలుపునిచ్చారు. యుపిఐ విజయం ద్వారా భారత్ తన సాంకేతిక సామర్థ్యాన్ని ఇప్పటికే ప్రపంచానికి నిరూపించిందని, ఇప్పుడు మరింత పెద్ద లక్ష్యాలను నిర్దేశించు కోవాలని చెప్పారు. అలాగే నెక్స్ట్-జెన్ టెలికమ్యూనికేషన్‌ను వేగవంతం చేస్తూ, స్వదేశీ 6ఉ సాంకేతికతను దేశంలోని మూలమూలలకూ తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. నాల్గవ ధారగా మౌలిక వసతులు, 'గతి శక్తి' ద్వారా అనుసంధానాన్ని పెంచడంపై మాట్లాడారు. వ్యాపారాన్ని విస్తరించడానికి, ల్యాజిస్టిక్స్ మెరుగు పరచడానికి, వాణిజ్యాన్ని ప్రోత్సహించడానికి రోడ్లు, హైవేలు, ఎక్స్‌ప్రెస్‌వేల అభివృద్ధి అత్యంత కీలకమని, వాటికి నిరంతరం ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు. ఈ వేగవంతమైన కనెక్టివిటీ సరికొత్త ఆర్థిక అవకాశాలను తెరుస్తుందన్నారు.ఐదవ ధారగా 'రక్షా శక్తి' నిలిచింది. రక్షణ రంగంలో దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించి, స్వదేశీ తయారీని బలోపేతం చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు.

## ప్రత్యేక ఆకర్షణగా మోడీ వస్త్రధారణ

### బాందనీ తలపాగాతో అకట్టుకున్న ప్రధాని



న్యూఢిల్లీ,ఆగస్ట్15 : 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రధాని మోదీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఎరుపు రంగుతో కూడిన సాంప్రదాయ రాజస్థానీ 'బాంధనీ' తలపాగాను ధరించి ఆకట్టుకున్నారు. ఈ తలపాగాకు జతగా తెల్లటి కుర్తా, చాక్లెట్ గోధుమరంగు వెస్ట్‌కోట్ జాకెట్ ధరించారు. దేశభక్తిని చాటేలా జేబులో జాతీయ జెండా రంగులైన కాషాయం, తెలుపు, ఆకుపచ్చతో కూడిన 'పాకెట్ స్క్వేర్'ను ప్రత్యేకంగా అలంకరించుకున్నారు. రాజస్థాన్, గుజరాత్‌లో బాంధనీ వస్త్ర కళకు ప్రత్యేక గుర్తింపు ఉంది. చిన్న చిన్న వస్త్రాలను దారంతో కట్టి (టై-అండ్-డై) రంగులు అద్దే విధానంలో ఈ డిజైన్లు రూపొందుతాయి. ఆ దారాలు తొలగించిన తర్వాత వస్త్రంపై చుక్కలు, ఆకృతులు కనిపిస్తాయి. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మోదీ ధరించే తలపాగాలు ఏటా ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. 2025లో ఆయన కాషాయ తలపాగా, తెల్లటి కుర్తాతో ఆకట్టుకున్న సంగతి తెలిసిందే.

## చరిత్రను గుర్తుచేసుకొనే.. భవిష్యత్తును నిర్మించుకునే రోజు

- కులం, మతం లేని ఏకైక జాతీయ పండుగ జెండా పండుగ
- ఐదేళ్లలో యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తాం
- అన్నిరంగాల్లో ఏపిని ముందువరసలో నిలబెట్టే ప్రయత్నం
- విజయవాడలో జెండా ఆవిష్కరణలో మంత్రి లోకేశ్

విజయవాడ,ఆగస్ట్15 : ఆగస్టు 15 ఓ తేదీ మాత్రమే కాదని.. చరిత్రను గుర్తుచేసుకొనే.. భవిష్యత్తును నిర్మించుకునే రోజు అని మంత్రి నారా లోకేశ్ అన్నారు. విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య మైదానంలో జరిగిన స్వాతంత్ర్య వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాతీయ జెండాను ఎగురవేసిన అనంతరం ఆయన ప్రసంగిస్తూ కులం, మతం లేని ఏకైక జాతీయ పండుగ జెండా పండుగ అనిఅన్నారు. ఎన్టీఆర్ జిల్లా తరఫున నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో మంత్రి పాల్గొని.. జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. అనంతరం మాట్లాడుతూ.. ఇక్కడ వాతావరణం చూశాక స్కూల్ రోజులు గుర్తుకు వచ్చాయని తెలిపారు. జెండాలు కట్టి, పోటీల్లో పాల్గొని జెండా పండుగ రోజు బహుమతులు అందుకునే వాళ్లమని చిన్ననాటి స్మృతులను గుర్తుచేసుకున్నారు. ప్రతి ఇంటి పైనా జాతీయ జెండా ఎగురవేయాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారని తెలిపారు. విద్యా రంగంలో తమ ప్రభుత్వం ఎన్నో సంస్కరణలు తీసుకొస్తోందన్నారు. పాఠ్యపుస్తకాలపై సీఎం ఫొటో, తన ఫొటో లేదని, ర్యాంకులు సాధించిన విద్యార్థుల ఫొటోలను వేశామన్నారు. విద్యను ఉపాధి రంగానికి అనుసంధానం చేస్తున్నాం. రాజధాని అమరావతికి కేంద్రం చట్టబద్ధత కల్పించింది. పోలవరం నిర్మాణం, విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ, రైల్వే జోన్ సాధించాం. అభివృద్ధి, సంక్షేమం మన ప్రభుత్వానికి జోడెద్దులు. పెద్ద పెద్ద పరిశ్రమలు వచ్చి రాష్ట్రానికి చిరునామాగా మారాయి. ఐదేళ్లలో యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తాం. ఇంకా ఎన్నేళ్లు ఉద్యోగాలు, ఉపాధి కోసం పక్క రాష్ట్రాల వైపు చూస్తాం? అన్నిరంగాల్లో ఏపీని ముందువరుసలో ఉంచేందుకు కృషి చేస్తున్నాం. కులం, మతం, ప్రాంతాలకతీతంగా రాష్ట్రాభివృద్ధికి కృషి చేయాలని ప్రమాణం చేద్దాం. కసితో, పట్టుదలతో పనిచేద్దాం. పక్క రాష్ట్రాలు మనవైపు చూసేలా అభివృద్ధి చేద్దామని మంత్రి లోకేశ్ పిలుపునిచ్చారు. అహింసా మార్గం ద్వారా స్వాతంత్య్రం తెచ్చిన మహనీయుడు మహాత్మా గాంధీ అని మంత్రి కొనియాడారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్, ఝాన్సీ లక్ష్మీబాయి వంటి ఎందరో స్వాతంత్య్రం కోసం పోరాడారన్నారు. మువ్వన్నెల జెండా మన ఆత్మ విశ్వాసంగా పేర్కొన్నారు. పింగళి వెంకయ్య, టంగుటూరి ప్రకాశం పంతులు అందరికీ స్ఫూర్తి అని చెప్పుకొచ్చారు. అన్న ఎన్టీఆర్ నడయాడిన జిల్లాలో జాతీయ పతాకం ఎగురవేయడం ఆనందంగా ఉందన్నారు. విద్యాశాఖ మంత్రిగా విద్యలో అనేక సంస్కరణలు తీసుకొచ్చామని వెల్లడించారు. 'మహిళలను గౌరవించండి.. భరోసా కలిగించండి' అని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ఉద్యోగాల కల్పనపై దృష్టి పెట్టామని.. అనేక ఖాళీలను భర్తీ చేసేలా ముందుకు సాగుతున్నామని లోకేశ్ వెల్లడించారు. ప్రధాని మోదీ అండగా ఉంటూ అన్ని విధాలా సహకారం అందిస్తున్నారన్నారు. అమరావతిని శాశ్వత రాజధానిగా ప్రకటించారని తెలిపారు. పోలవరం పూర్తి చేస్తున్నామని.. విశాఖ స్టీల్ ఫ్యాక్టరీని కాపాడామని చెప్పుకొచ్చారు. పొట్టి శ్రీరాములు త్యాగాల ఫలితంగా నాడు ఆంధ్రప్రదేశ్ ఏర్పడిందని.. హైదరాబాద్‌ను అందరం కలిసి అభివృద్ధి చేసుకున్నామని చెప్పారు. 2014 లో రాష్ట్ర విభజన అశాస్త్రీయంగా చేసి మెడపట్టి గెంటేశారని.. ఆరోజు ఎక్కడ ఉండాలో కూడా తెలియని పరిస్థితి ఉందన్నారు. సీఎం చంద్రబాబు ఒక్కరే మనకి ఆశా కిరణమని అన్నారు. 2014-2019 మధ్య ఏపీ అభివృద్ధి కోసం చంద్రబాబు ఎంతో తపనపడ్డారని మంత్రి తెలిపారు. 2019 తరువాత వచ్చిన ప్రభుత్వం రాష్టాన్ని నాశనం చేసిందని విమర్శించారు. 2024 తరువాత సీఎంగా చంద్రబాబు అభివృద్ధిని ముందుకు తీసుకెళున్నారన్నారు. ఏడు పదులు దాటినా కుర్రాడిలా పరుగులు పెడుతున్నారని అన్నారు. మెగా డీఎస్సీ ద్వారా ఉద్యోగాలు ఇచ్చామని, పోలీసు శాఖలో ఖాళీలు భర్తీ చేశామన్నారు. గూగుల్ తెచ్చిన సమయంలో ఎంతో ఆనందం కలిగిందని అన్నారు. చంద్రబాబు అభినందిస్తారనుకుంటే.. లక్ష్యాన్ని నిర్దేశిరచారని తెలిపారు. ఏపీలో 20 లక్షల మందికి ఉద్యోగాలు ఇవ్వడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. దేశ భక్తితో పాటు రాష్ట్ర భక్తి కూడా ఉండాలన్నారు.

# అభివృద్ధి పథంలో రాజన్న సిరిసిల్ల జిల్లా






**-ఘనంగా స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు**
**-జాతీయ జెండాను ఎగురవేసిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

బలగం టీవీ,రాజన్న సిరిసిల్ల:

దేశ స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. జిల్లా పోలీస్ కార్యాలయం ఆవరణలోని పరేడ్ గ్రౌండ్ లో ఏర్పాటు చేసిన స్వాతంత్య్ర వేడుకలకు ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం జాతీయ జెండాను ఎగురవేసి.. వందనం చేశారు.

ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని ,ఆలయ అభివృద్ధి కోసం ఇప్పటివరకు రూ.390 కోట్ల నిధులు మంజూరయ్యాయని పేర్కొన్నారు. మూలవాగు నుంచి ఆలయం వరకు రహదారి విస్తరణ పనులు తుది దశకు చేరుకున్నాయని అన్నారు. గుడి చెరువు బండ్ పార్కును ఇప్పటికే ప్రారంభించగా, గుడి చెరువులో బోటింగ్ సౌకర్యం కల్పించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు .

వస్త్ర పరిశ్రమ కార్మికులకు ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని తెలిపారు. ఇందిరా మహిళా శక్తి చీరల తయారీ కోసం కోట్లాది మీటర్ల వస్త్ర ఉత్పత్తి ఆర్డర్లను సిరిసిల్లకు కేటాయించడం ద్వారా వేలాది మంది కార్మికులకు ఉపాధి లభిస్తోందన్నారు.నేతన్నకు పొదుపు పథకం, నేతన్న భద్రత పథకం ద్వారా కార్మికులకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.99



రోజుల ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతంగా అమలు చేసినట్లు తెలిపారు. ఆరోగ్యం, విద్య, వ్యవసాయం, మహిళా సంక్షేమం, యువజనాభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ తదితర పది ప్రధాన అంశాలపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించినమని అన్నారు.జిల్లాలో మొత్తం 9,086 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయగా, ఇప్పటికే 3,759 ఇళ్ల నిర్మాణం పూర్తయిందని,లబ్ధిదారుల ఖాతాల్లో రూ.159 కోట్లకు పైగా నిధులు జమ చేసినామని అన్నారు.మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు 4 కోట్లకు పైగా జీరో టికెట్లు జారీ అయ్యాయని,రూ.500కే గ్యాస్ సిలిండర్ పథకం కింద లక్షకు పైగా కుటుంబాలకు సబ్సిడీ అందించినామనిఅన్నారు.జిల్లాలో 46 వేల మందికి పైగా రైతులకు రూ.370 కోట్లకు పైగా రుణమాఫీ చేసినట్లు తెలిపారు. రైతు భరోసా పథకం కింద రైతుల ఖాతాల్లో రూ.149 కోట్లకు పైగా జమ చేసినామని,ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు తెలంగాణ జలసిరి కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు.ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి విద్య అందించేందుకు చర్యలు చేపట్టినామని,యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని అన్నారు.

ఆరోగ్యశ్రీ పథకం పరిమితిని రూ.10 లక్షలకు పెంచిన ప్రభుత్వం, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తోందని పేర్కొన్నారు.జిల్లాలో రహదారులు, వంతెనలు, మున్సిపల్ అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. మిషన్ భగీరథ ద్వారా ప్రతి గ్రామానికి తాగునీరు అందిస్తున్నట్లు పేర్కొన్నారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి అర్హుడికి చేరవేయడమే లక్ష్యమని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులు, మీడియా ప్రతినిధులు సమన్వయంతో పనిచేయడం వల్లే అభివృద్ధి సాధ్యమైందని పేర్కొన్నారు.

అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఉత్తమ సేవలు అందించిన వివిధ శాఖల అధికారులు, పోలీస్, మున్సిపల్, గ్రామ పంచాయతీ సిబ్బందికి ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితె తదితరుల తో కలసి ప్రశంసా పత్రాలు పంపిణీ చేశారు. ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందించారు.వ్యవసాయ, ఉద్యానవన శాఖ, చేనేత జౌళి శాఖ, మత్స్య శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, పశు సంవర్ధక శాఖ, గ్రామీణ అభివృద్ధి శాఖ, అగ్ని మాపక శాఖ, ఆర్టీసీ, గృహ నిర్మాణ శాఖ, జిల్లా సంక్షేమ శాఖ, పౌర సరఫరాల, సర్వే అండ్ రెవెన్యూ శాఖ, సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీల పనులు, వివరాలు, పథకాలతో రూపొందించిన శకటాలు ప్రదర్శించారు.

అలాగే గ్రామీణ అభివృద్ధి శాఖ, వ్యవసాయ, ఉద్యానవన, పోలీస్ శాఖ, 17వ బెటాలియన్, అటవీ శాఖ, లీడ్ బ్యాంక్ తదితర శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. వాటి వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు, మంచి శకటాలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు, నగదు అందజేసి .అభినందించారు.స్త్రీ నిధి ద్వారా జిల్లాలోని మహిళా సంఘాల సభ్యులకు ఈ స్కూటీ, ఈ ఆటో లను,855 మహిళా సంఘాలకు బ్యాంకు రుణాలు రూ. 100 కోట్ల 12 లక్షలు, అలాగే 847 సంఘాలకు స్త్రీ నిధి రూ. 20 కోట్ల 66 లక్షల రుణాలను పంపిణీ చేశారు.

టీవీ సీ సీ స్కీమ్ కింద జిల్లాలోని పలువురు దివ్యాంగులకు ఆటో, హైబ్రిడ్ వీల్ చైర్ అటాచ్మెంట్ పంపిణీ చేశారు. కోనరావుపేట మండలం నిమ్మపల్లి గ్రామానికి చెందిన దుంపేటి కుమారస్వామికి ఎలక్ట్రిక్ ఆటో, గుర్రంవాణిపల్లికి చెందిన కంది తిరుమల్ రెడ్డి, ముస్తాబాద్ మండలం గూడెం గ్రామానికి చెందిన కొమిరే పరశురాముకు హైబ్రిడ్ వీల్ చైర్ అటాచ్మెంట్ ను అందజేశారు.ఈ కార్యక్రమంలో సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ చైర్మన్లు జిందం కళ, పుల్కం రాజు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, జిల్లా రెవెన్యూ అధికారి జయశ్రీ, సిరిసిల్ల వేములవాడ ఆర్డీవోలు శ్రీధర్ బాబు, కే ఎస్ బీ కుమారి, డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, జిల్లా ప్రణాళిక అధికారి పీబీ శ్రీనివాసాచారి, జిల్లా సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీరాజం, ఏవో రాంరెడ్డి, సిరిసిల్ల తహసీల్దార్ మహేష్ కుమార్, వివిధ శాఖల అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## జాతీయ జెండాను ఎగురవేసిన జిల్లా కలెక్టర్

బలగం టీవీ,రాజన్న సిరిసిల్ల:

భారత స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ జాతీయ జెండాను శనివారం ఎగురవేశారు.భారత స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల సందర్భంగా జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించి.. జాతీయ జెండాను ఎగురవేశారు. అంతకు ముందు జిల్లా కలెక్టర్ క్యాంప్ కార్యాలయం, జడ్పీ కార్యాలయం ఆవరణలో ఎగురవేశారు. పలువురు విద్యార్థులకు నోట్ బుక్ లు అందజేశారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, డీఆర్ఓ జయశ్రీ, ఏవో రాంరెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు

బలగం టీవీ,రాజన్న సిరిసిల్ల:

జిల్లా పోలీస్ కార్యాలయంలో స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే జాతీయ జెండాను ఎగురవేసి పోలీసు అధికారులు, సిబ్బంది, ప్రజలకు స్వాతంత్య్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. దేశ స్వాతంత్య్రం కోసం ప్రాణాలను సైతం త్యాగం చేసిన స్వాతంత్య్ర సమరయోధుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని ఎస్పీ మహేష్ బి. గితే అన్నారు. వారి స్ఫూర్తితో దేశ సమగ్రత, ఐక్యతతో పాటు శాంతిభద్రతల పరిరక్షణలో పోలీస్ శాఖ కీలక పాత్ర పోషించాలని సూచించారు. ప్రజల భద్రత, చట్టబద్ధ పాలనతో పాటు స్నేహపూర్వక, పారదర్శక, సాంకేతికత ఆధారిత పోలీసింగ్ సేవలనుఅందించడమే లక్ష్యంగా పనిచేయాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో డీఎస్పీలు నాగేంద్రచారి, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, సీఐలు, ఆర్ఐలు, ఏఓ, ఎస్ఐలు, కార్యాలయ సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# సిరిసిల్ల వ్యవసాయ కళాశాలలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:

బాబు జగ్జీవన్ రామ్ వ్యవసాయ కళాశాల, సిరిసిల్లలో 80వ స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. స్వాతంత్య్ర సమరయోధులు, జాతీయ నాయకుల చిత్రపటాలకు పుష్పాంజలి ఘటించి వారి త్యాగాలను స్మరించుకున్నారు. అనంతరం అసోసియేట్ డీన్ డా. ఎస్. ఉపేందర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జాతీయ గీతాన్ని ఆలపించారు.డా. టి. అరుణ్‌బాబు మాట్లాడుతూ స్వాతంత్య్ర సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ ప్రతి పౌరుడు దేశ అభివృద్ధిలో తన వంతు బాధ్యతను నిర్వర్తించాలని అన్నారు. వ్యవసాయ విద్యార్థులు రైతుల అభ్యున్నతికి కృషి చేస్తూ ఆధునిక, సుస్థిర వ్యవసాయ పద్ధతులను రైతులకు చేరువ చేయాలని సూచించారు.డా. రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ బాధ్యతాయుత పౌరసత్వం, నిబద్ధతతో కూడిన సేవ ద్వారా దేశ ప్రగతికి ప్రతి ఒక్కరూ తోడ్పడాలని అన్నారు.అసోసియేట్ డీన్ డా. ఎస్. ఉపేందర్ మాట్లాడుతూ దేశ ఆహార భద్రతలో వ్యవసాయ రంగం కీలక పాత్ర పోషించిందని తెలిపారు. సుస్థిర వ్యవసాయ పద్ధతులతో పోషక విలువలున్న ఆహారాన్ని ఉత్పత్తి చేయడంపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. రైతులకు శాస్త్రీయ, సాంకేతిక పరిజ్ఞానాన్ని చేరువ చేసి వారి జీవనోపాధి మెరుగుదలకు కృషి చేయాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు . ఈ కార్యక్రమంలో విద్యార్థులు, బోధన, బోధనేతర, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.





## స్వాతంత్య్ర సమరయోధులకు సెల్యూట్..

**- పేపర్ లీకేజీలు లేని భారతదేశం కావాలి**
**-బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మాండ్లు**

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:

రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని బీసీ భవన్‌లో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో 80వ స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మాండ్లు జాతీయ జెండాను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా పర్శ హన్మాండ్లు మాట్లాడుతూ ప్రజలకు స్వాతంత్య్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడి దేశానికి స్వాతంత్య్రం సాధించేందుకు ప్రాణత్యాగం చేసిన స్వాతంత్య్ర సమరయోధులందరికీ సెల్యూట్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. వారి త్యాగాలను స్మరించుకుంటూ నేటి యువత అవినీతి, అక్రమాలు, కుల, మత, వర్ణ వివక్షకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు.

పాలకులు స్వార్థం, స్వలాభాన్ని వీడి సమాజ హితం కోసం పనిచేయాలని అన్నారు. యువత గంజాయి, డ్రగ్స్‌కు దూరంగా ఉంటూ దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. పరీక్షా పేపర్ లీకేజీలు లేని భారతదేశాన్ని నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు.అట్టడుగు వర్గాలకు అన్ని రంగాల్లో న్యాయం, సమాన అవకాశాలు లభించినప్పుడే దేశానికి సంపూర్ణ స్వాతంత్య్రం వచ్చినట్లవుతుందని పర్శ హన్మాండ్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు తడుక కమలాకర్, రాపెల్లి రమేష్, కందుకూరి రామాగౌడ్, తోట్ల రాములు యాదవ్, కుసుమ ప్రభాకర్, బోయిని శ్రీనివాస్, సామల తిరుపతి, తోట్ల మల్లేశ్ యాదవ్, నల్లా శ్రీకాంత్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ భవన్‌లో ఘనంగా 80వ స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు..

బలగం టీవీ,రాజన్న సిరిసిల్ల:

జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్‌లో 80వ స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలను బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి గౌరవ వందనం సమర్పించారు.ఈ సందర్భంగా ప్రజలందరికీ 80వ స్వాతంత్య్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం తోట ఆగయ్య మాట్లాడుతూ స్వాతంత్య్ర సమరయోధుల త్యాగాలు, వారి పోరాటాల ఫలితంగానే దేశానికి స్వాతంత్య్రం లభించిందన్నారు. సమరయోధుల ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని దేశాభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం ప్రతి ఒక్కరూ తమ బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. దేశ ఐక్యత, సమగ్రతను కాపాడటం ప్రతి పౌరుడి బాధ్యత అన్నారు.దేశం మరింత అభివృద్ధి చెందాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో నాఫ్కప్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, మున్సిపల్ చైర్మన్ జిందం కళాచక్రపాణి, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, మాజీ జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ రాఘవరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి గూడూరి ప్రవీణ్, పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, గ్రంథాలయ శాఖ మాజీ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కుంబాల మల్లారెడ్డి, మ్యాన రవి, సత్తర్, కౌన్సిలర్లు, నాయకులు, మహిళా నాయకురాళ్లు పాల్గొన్నారు.



# పేదలకు సన్నబియ్యం అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ



**పేదల గౌరవం కోసం ప్రజా ప్రభుత్వం కృషి..**
**-ప్రభుత్వ ఆది శ్రీనివాస్**

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :

పేదలకు సన్నబియ్యం అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. ప్రజా ప్రభుత్వం ఆదేశాల మేరకు పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని శనివారం సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని రగుడు ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి మండలానికి ఐదుగురు చొప్పున లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను వారు పంపిణీ చేశారు. జిల్లాలో 24,174 నూతన రేషన్ కార్డులు మంజూరు కాగా.. మొత్తం 1,95,915 స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

రేషన్ కార్డు కేవలం గుర్తింపు కార్డు మాత్రమే కాదని, పేదలకు గౌరవంతో పాటు ఆరోగ్యశ్రీ వంటి సంక్షేమ పథకాలకు ఉపయోగపడే ముఖ్యమైన పత్రమని పేర్కొన్నారు. జిల్లాలో ప్రతి నెలా 3,700 మెట్రిక్ టన్నుల సన్నబియ్యాన్ని పేదలకు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. సంపన్నులు తినే సన్నబియ్యాన్ని పేదలు సైతం తినాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తోందన్నారు.

రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేసి రాష్ట్రవ్యాప్తంగా రూ.21,650 కోట్ల మేర ప్రయోజనం కల్పించామని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని చెప్పారు. నేతన్నలకు ఉపాధి కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, సిరిసిల్లను చేనేత, వస్త్ర పరిశ్రమ అభివృద్ధి కేంద్రంగా తీర్చిదిద్దేందుకు చర్యలు కొనసాగుతున్నాయని అన్నారు.

ప్రతి రేషన్ లబ్ధిదారుడికి సన్నబియ్యం

జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభించామని తెలిపారు. జిల్లాలో మొత్తం 1,95,915 స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.ప్రస్తుతం ప్రతి మండలానికి ఐదు కార్డుల చొప్పున పంపిణీ చేస్తున్నామని, సోమవారం నుంచి అన్ని మండలాల్లో పంపిణీ ప్రక్రియ ప్రారంభమవుతుందని అన్నారు .

టీ-రేషన్ యాప్ ద్వారా రేషన్ సరుకులు, దుకాణాలు, నిల్వలు తదితర పూర్తి వివరాలను తెలుసుకోవచ్చున్నారు. అంగన్వాడీ కేంద్రాలు, రెసిడెన్షియల్, ప్రభుత్వ విద్యాసంస్థలతో పాటు రేషన్ కార్డుదారులందరికీ సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని తెలిపారు. గత యాసంగిలో జిల్లాలో మూడు లక్షల మెట్రిక్ టన్నులకు పైగా ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, మున్సిపల్ చైర్మన్లు జిందం కళ, పుల్కం రాజు, ఆత్మ కమిటీ డివిజన్ చైర్మన్ ముకుంద రెడ్డి, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, ఆర్డీవోలు శ్రీధర్ బాబు, కేఎస్‌బీ కుమారి, జిల్లా పౌరసరఫరాల అధికారి బుచ్చిబాబు, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.



## చదువుకు సైకిల్ ఆసరా.. మానాల విద్యార్థులకు 12 సైకిళ్ల అందజేత..!

బలగం టీవీ , రుద్రంగి :

విద్యార్థుల భవిష్యత్‌పై సామాజిక బాధ్యతతో కూడిన దృక్పథం ఉంటే.. చిన్న సహాయం కూడా వారి విద్యాభ్యాసానికి పెద్ద ఆసరాగా నిలుస్తుంది. స్వాతంత్య్ర దినోత్సవం రోజున రుద్రంగి మండలం మానాల గ్రామంలోని దూర ప్రాంత విద్యార్థుల ఇబ్బందులను గుర్తించిన ఆర్మూర్‌కు చెందిన విలియన్ భాస్కర్ 12 సైకిళ్లను అందించి తన సేవా దృక్పథాన్ని చాటుకున్నారు. రుద్రంగి మండలం మానాల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న దూర ప్రాంత విద్యార్థులకు స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ఈ సైకిళ్లను పంపిణీ చేశారు. ఉప సర్పంచ్ దాసరి అశోక్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో విలియన్ భాస్కర్ సౌజన్యంతో విద్యార్థులకు సైకిళ్లను అందజేశారు. దూర ప్రాంతాల నుంచి పాఠశాలకు రాకపోకలు సాగించే విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని సైకిళ్లు అందించడం పట్ల విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థుల విద్యాభ్యాసానికి తోడ్పాటునందించడంతో పాటు సమాజం పట్ల బాధ్యతను చాటేలా సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని గ్రామస్థులు పేర్కొన్నారు. విద్యార్థుల చదువుకు అవసరమైన సహాయాన్ని అందించడమే లక్ష్యంగా భవిష్యత్‌లోనూ ఇలాంటి సేవా కార్యక్రమాలను కొనసాగించాలని పలువురు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బుర్ర శంకర్, యంఈవో రామకృష్ణ, వార్డు మెంబర్ లక్కాకుల రమేష్, వైస్ ఎంపీపీ, పిసరి భూమయ్య, రిటైర్డ్ ఏడిఈ లక్ష్మణ్ నాయక్, రుప్లా తండా సర్పంచ్ జవహర్ లాల్ నాయక్, విడిసి చైర్మన్ మహేష్,మదన్, తుమ్ జలపతి, లక్కాకుల శ్రీనివాస్, నాంచారి రాకేష్, కోక్కుల వంశీ, కోల నరేందర్,చెదలు నవీన్,పాల గణేష్, మరియు ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ యువకులు ప్రజలు పాల్గొన్నారు.



# భారత్‌కు బంగ్లాదేశ్ ప్రధాని తారిక్ రహమాన్!

## వచ్చే వారమే పర్యటన.. ప్రధాని మోదీతో భేటీ అయ్యే అవకాశం

## ఇరు దేశాల మధ్య సత్సంబంధాల పునరుద్ధరణే లక్ష్యంగా చర్చలు?

బలగం టీవీ, హైదరాబాద్

బంగ్లాదేశ్ నూతన ప్రధానమంత్రి తారిక్ రహమాన్ త్వరలోనే భారతదేశంలో పర్యటించనున్నారు. ఈ నెల ఆగస్టు 20 నుంచి 25వ తేదీల మధ్య ఆయన భారత పర్యటన ఉండనున్నట్లు బంగ్లాదేశ్ మీడియా వర్గాలు వెల్లడించాయి. ప్రధానంగా ఆగస్టు 20, 21 తేదీల్లో లేదా 21, 22 తేదీలలో ఈ పర్యటన ఖరారయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. పర్యటనకు సంబంధించిన కచ్చితమైన షెడ్యూల్, అధికారిక వివరాలను త్వరలోనే ఖరారు చేయనున్నారు.

బంగ్లాదేశ్ ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తారిక్ రహమాన్ భారత్‌లో పర్యటించనుండటం ఇదే తొలిసారి. ఈ పర్యటనలో భాగంగా ఆయన భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో ద్వైపాక్షిక చర్చలు జరిపే అవకాశం ఉందని సమాచారం.

కీలక అంశాలపై ద్వైపాక్షిక చర్చలు

ఇటీవలి రాజకీయ పరిణామాల నేపథ్యంలో భారత్-బంగ్లాదేశ్ మధ్య సంబంధాలలో కొంత ఉద్రిక్తతలు చోటుచేసుకున్న విషయం తెలిసిందే. బంగ్లాదేశ్‌లో మైనారిటీలైన హిందువులపై జరుగుతున్న దాడుల పట్ల భారత్ తీవ్ర ఆందోళన, ఆగ్రహం వ్యక్తం చేయగా.. మరోవైపు మాజీ ప్రధాని షేక్ హసీనాకు భారత్ ఆశ్రయం ఇవ్వడంపై బంగ్లాదేశ్ అసంతృప్తితో ఉంది.

ఈ నేపథ్యంలో జరగనున్న తారిక్ రహమాన్ పర్యటన ఇరు దేశాల దౌత్య సంబంధాల మెరుగుదలకు ఎంతో కీలకం కానుంది. ఈ భేటీలో ప్రధానంగా మాజీ ప్రధాని షేక్ హసీనాను బంగ్లాదేశ్‌కు అప్పగించే అంశంతో పాటు, ప్రస్తుతం బంగ్లాదేశ్ ఎదుర్కొంటున్న తీవ్ర విద్యుత్ సంక్షోభం మరియు ఇతర ప్రాంతీయ సహకార అంశాలపై చర్చలు జరిగే అవకాశం ఉంది.



# యుద్ధ నౌకలతో హర్మ్యూజ్‌ను సొంతం చేసుకోలేరు:

## ట్రంప్ వ్యాఖ్యలకు ఇరాన్ కౌంటర్!

## జలసంధిపై నియంత్రణ మాదే.. అమెరికా భ్రమలు వీడాలి: ఇరాన్ విదేశాంగ శాఖ స్పష్టీకరణ

బలగం టీవీ, హైదరాబాద్

హర్మ్యూజ్ జలసంధి (Strait of Hormuz) పై పూర్తి నియంత్రణ అమెరికాదేనంటూ ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై ఇరాన్ తీవ్రస్థాయిలో మండిపడింది. హర్మ్యూజ్ జలసంధి ఎప్పటికీ తమ నియంత్రణలోనే ఉంటుందని, కేవలం యుద్ధ నౌకలను మోహరించినంత మాత్రాన దానిని ఎవరూ ఆక్రమించుకోలేరని తేల్చిచెప్పింది.

అమెరికా భ్రమలు వీడే వరకు దిగ్బంధనం కొనసాగుతుంది

ఈ అంశంపై ఇరాన్ ఉప విదేశాంగ మంత్రి కాజెమ్ ఘరీబాబాది సామాజిక మాధ్యమం 'ఎక్స్' (X) వేదికగా స్పందిస్తూ.. హర్మ్యూజ్ జలసంధిని మూసి ఉంచాలా లేదా తెరవాలా అనేది పూర్తిగా ఇరాన్ నిర్ణయంపైనే ఆధారపడి ఉంటుందని స్పష్టం చేశారు. "అగ్రరాజ్యం తన అజ్ఞానపు భ్రమలను విడిచిపెట్టి ఓటమిని అంగీకరించే వరకు హర్మ్యూజ్‌పై ఇరాన్ దిగ్బంధనం కొనసాగుతూనే ఉంటుంది. మేము సైనిక బెదిరింపులకు భయపడేది లేదు" అని ఆయన పేర్కొన్నారు.

అలాగే ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ □□ లాడుతూ.. హర్మ్యూజ్ ద్వారా నౌకలు స్వేచ్ఛగా ప్రయాణిస్తున్నాయని అమెరికా చెబుతున్న మాటలలో ఎలాంటి నిజం లేదని ఖండించారు. తమ సాయుధ దళాల ముందస్తు అనుమతి లేకుండా ఏ వాణిజ్య నౌక కూడా ఈ మార్గం గుండా ప్రయాణించలేదని స్పష్టం చేశారు.

హర్మ్యూజ్‌ను అమెరికా భూభాగంగా ప్రకటిస్తాం: ట్రంప్

కాగా, శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరికలు జారీ చేశారు. ఇరాన్‌ను యుద్ధంలో ఓడించిన అనంతరం హర్మ్యూజ్ జలసంధిని అమెరికా భూభాగంగా ప్రకటిస్తామని అన్నారు. ఇరాన్ వద్ద ఉన్న అణ్వాయుధ సామర్థ్యం ప్రపంచానికి ప్రమాదకరమని, దానిని పూర్తిగా నిర్మూలించడమే తమ ప్రధాన లక్ష్యమని ట్రంప్ పేర్కొన్నారు. ట్రంప్ చేసిన ఈ వ్యాఖ్యలతో ఇరు దేశాల మధ్య తీవ్రస్థాయిలో మాటల యుద్ధం చెలరేగింది




## వీర్నపల్లిలో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు..

బలగం టీవీ, వీర్నపల్లి:

రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండల కేంద్రంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ జెండాను ఆవిష్కరించి, దేశ స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకున్నారు.

ఈ సందర్భంగా వీర్నపల్లి మండల అఖిల భారత యాదవ జాతీయ బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడు పరమాల మల్లేశం యాదవ్ మాట్లాడుతూ.. స్వాతంత్ర్య సమరయోధుల ఆశయాలను ముందుకు తీసుకెళ్లడంతో పాటు దేశ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుల ఆశయాలను ముందుకు తీసుకెళ్లడంతో పాటు దేశ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు చీర్ల శ్రీనివాస్, కార్యదర్శి ఆకుల మహేందర్, గ్రామ శాఖ నాయకులు మామిళ్ల మోహన్, దాన కార్యదర్శి దేశరాజు అనిల్, వారణాసి మోహన్, ఉపాధ్యక్షులు బోడ పృథ్వీరాజ్, దేశరాజ్ లక్ష్మీనారాయణ, బోడ వెంకటి తదితరులు పాల్గొన్నారు.



## ఎంపీహెచ్ఎస్ పెద్దూర్ పాఠశాలలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు..

బలగం టీవీ, రాజన్నసిరిసిల్ల:

MPHS పెద్దూర్ పాఠశాలలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు దేశభక్తి, ఉత్సాహం మరియు ఆనందోత్సాహాల మధ్య ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా విద్యార్థులు ఆలపించిన దేశభక్తి గీతాలు, దేశభక్తిని చాటే పాటలకు చేసిన ఆకట్టుకునే నృత్య ప్రదర్శనలు అందరినీ అలరించాయి. చిన్నారుల ప్రతిభ, ఉత్సాహం మరియు దేశభక్తి భావం ప్రతి ఒక్కరినీ ఎంతో సంతోషపరిచాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు చక్రవర్తుల రమాదేవి, 8వ వార్డ్ కౌన్సిలర్ లింగంపల్లి భాగ్యలక్ష్మి సత్యనారాయణ, AAPC ఛైర్పర్సన్ తిప్పవరం సుధ, పాఠశాల ఉపాధ్యాయ బృందం గుండెల్లి రవీందర్, తోట శ్రీనివాస్, భాగ్యనగర్ మాధవి, లకావత్ ఉమా, జంగం రాజమల్లు, ఈరబోయిన రవి, భైరి వాణిశ్రీ, కడార్ల కల్పన, నాగుల వీణ, నందాల శంకర్, గ్రామ పెద్దలు, విద్యార్థిని విద్యార్థుల తల్లితండ్రులు మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# కశ్మీర్‌పై నార్వే-పాక్ చర్చలు.. భారత్ తీవ్ర అసహనం

## పీఓకేలో అరాచకాలపై అంతర్జాతీయ సమాజం దృష్టి సారించాలి: విదేశాంగ శాఖ స్పష్టీకరణ

బలగం టీవీ, హైదరాబాద్



కశ్మీర్ అంశంపై నార్వే-పాకిస్థాన్ దేశాలు చర్చలు జరపడం పట్ల భారత్ తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. జమ్ముకశ్మీర్, లద్ధాఖ్ ప్రాంతాలు భారత్‌లో అంతర్భాగమని, అవి ఎప్పటికీ విడదీయలేని భూభాగాలని భారత విదేశాంగ శాఖ పునరుద్ఘాటించింది. పాకిస్థాన్ చట్టవిరుద్ధంగా ఆక్రమించిన 'పాక్ ఆక్రమిత కశ్మీర్' (పీఓకే)లో జరుగుతున్న అరాచకాలు, అక్కడ ఉగ్రవాద కార్యకలాపాలపై అంతర్జాతీయ సమాజం దృష్టి సారించాలని భారత విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ స్పష్టం చేశారు.

వివాదానికి దారితీసిన నార్వే మంత్రి పర్యటన

నార్వే విదేశాంగ మంత్రి బార్త్ ఐడ్ రెండు రోజుల పాటు (ఆగస్టు 13, 14 తేదీల్లో) పాకిస్థాన్‌లో పర్యటించారు. గత దశాబ్ద కాలంలో నార్వే నుంచి అత్యున్నత స్థాయి పర్యటన ఇదే కావడం గమనార్హం. ఈ పర్యటనలో భాగంగా ఆయన పాక్ ఉప ప్రధాని ఇషాక్ దార్, సైన్యాధిపతి అసిమ్ మునీర్‌లతో సమావేశమయ్యారు. ఇస్లామాబాద్‌లో జరిగిన ఈ చర్చల్లో కశ్మీర్ వివాదంతో పాటు ప్రాంతీయ అంశాలు, అఫ్గానిస్థాన్ పరిస్థితులు, రక్షణ ఒప్పందాల గురించి చర్చించినట్లు నార్వే విదేశాంగ మంత్రి వెల్లడించారు.



భారత్ తీవ్ర అభ్యంతరం

జమ్ముకశ్మీర్ అంశాన్ని ప్రాంతీయ సమస్యగా నార్వే విదేశాంగ మంత్రి ప్రత్యేకంగా ప్రస్తావించడంపై భారత మాజీ విదేశాంగ కార్యదర్శి కన్వల్ సిబల్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. "జమ్ముకశ్మీర్‌ను ప్రత్యేకంగా ప్రస్తావించకుండా, కేవలం ప్రాంతీయ సమస్యలపై చర్చించినట్లు చెప్పి ఉంటే బాగుండేది. కశ్మీర్ సమస్యపై అంతర్జాతీయ దృష్టిని ఉంచాలని కోరుకునే పాకిస్థాన్ ఎత్తుగడలకు తావిచ్చేలా మాట్లాడటం సరికాదు" అని ఆయన విమర్శించారు.

పీఓకేలో అట్టుడుకుతున్న పరిస్థితులు

పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే) గత కొన్ని రోజులుగా హింసతో అట్టుడుకుతోంది. అక్కడ నిరసనకారులపై పాక్ ప్రభుత్వం హింసాత్మక చర్యలకు పాల్పడుతోందనే ఆరోపణలు ఉన్నాయి. ఈ నిరసనలకు నాయకత్వం వహిస్తున్న 'జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ'ని ఉగ్రవాద వ్యతిరేక చట్టాల కింద నిషేధించినప్పటికీ స్థానికులు వెనక్కి తగ్గడం లేదు. ఈ అరాచకాలపై అంతర్జాతీయ సమాజం దృష్టి పెట్టాలని భారత్ కోరింది

# ఎందరో మహానీయుల త్యాగ ఫలితమే మన స్వాతంత్ర్యం

## వేములవాడ మున్సిపల్ ఛైర్మన్ పుల్కం రాజు

## - మున్సిపల్ కార్యాలయంలో వైభవంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు..

## - తొలిసారిగా మున్సిపల్ భవనంపై జాతీయ జెండా ఆవిష్కరించిన ఛైర్మన్ పుల్కం రాజు..



బలగం టీవీ, వేములవాడ:

ఎందరో మహానీయుల ప్రాణత్యాగాలు, పోరాటాల ఫలితంగానే భారతావని స్వేచ్ఛావాయువులు పీల్చుకుంటోందని వేములవాడ మున్సిపల్ ఛైర్మన్ పుల్కం రాజు కొనియాడారు. భారత 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని వేములవాడ పట్టణ మున్సిపల్ కార్యాలయంలో శనివారం వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. మున్సిపల్ పాలకవర్గం ఏర్పడిన తర్వాత ఇది తొలి స్వాతంత్ర్య దినోత్సవం కావడం విశేషం. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయ భవనంపై ఛైర్మన్ పుల్కం రాజు మున్సిపల్ పాలకవర్గం



తరుపున తొలిసారిగా జాతీయ జెండాను ఆవిష్కరించి, గౌరవ వందనం సమర్పించారు.

అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మన దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించడం వెనుక వేలాది మంది త్యాగధనుల కష్టం ఉందని గుర్తుచేశారు. మహాత్మా గాంధీ, అల్లూరి సీతారామరాజు, భగత్ సింగ్, సుభాష్ చంద్రబోస్, పటేల్ వంటి ఎందరో మహానీయులు చూపిన ధైర్యం, చేసిన పోరాటాలు ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయమని పేర్కొన్నారు. వారి త్యాగాలను ఎప్పటికీ మరువలేమని, వారి ఆశయాలకు అనుగుణంగా ప్రతీ ఒక్కరూ దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అలాగే తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమ పథకాలతో దేశంలోనే అగ్రగామిగా దూసుకుపోవాలని ఆకాంక్షించారు. వేములవాడ శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సారథ్యంలో వేములవాడ పట్టణం అన్ని రంగాల్లో మరింత వేగంగా అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పట్టణ ప్రజలందరికి స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

మున్సిపల్ కార్యాలయంతో పాటు పట్టణంలో నిర్వహించిన వేడుకల్లో ఛైర్మన్ పుల్కం రాజు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పట్టణ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం, సింగిల్ విండో సొసైటీ ఆవరణ, మున్నూరు కాపు సంఘం భవనం వద్ద జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఆయన హాజరై జెండా వందనం చేశారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల నాయకులు, స్థానిక ప్రజలతో కలిసి వేడుకలను ఉత్సాహంగా జరుపుకున్నారు. మహనీయుల ఆశయ సాధనకు అందరం కలిసికట్టుగా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమాలలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ నరాల శేఖర్, పట్టణ కౌన్సిలర్లు, మున్సిపల్ కమిషనర్ లోకేష్, కోఆప్షన్ సభ్యులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు, వివిద పార్టీల నాయకులు, మరియు పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పోలీస్ శాఖలో విశేష సేవలందించిన పోలీస్ అధికారులకు పతకాలు..

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:

పోలీస్ శాఖలో విధి నిర్వహణలో విశేషమైన సేవలు అందించినందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ప్రతిష్టాత్మకమైన పోలీస్ సేవా పతకాలకు ఎంపికైన జిల్లా పోలీస్ అధికారులకు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్, జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ఐపీఎస్ పతకాలను అందజేసి అభినందించారు. విధి నిర్వహణలో అంకితభావంతో, కష్టపడి పనిచేసే పోలీస్ అధికారులు, సిబ్బందికి వారి సేవలకు తగిన గుర్తింపు లభిస్తుందని,పోలీస్ శాఖలో విశేష సేవలు అందించి ప్రతిష్టాత్మకమైన పోలీస్ సేవా పతకాలకు ఎంపికైన అధికారులను ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ అభినందించారు.

**పోలీస్ సేవా పతకాలకు ఎంపికైన అధికారులు..**

1.రాజేందర్, హెడ్ కానిస్టేబుల్ – ముస్తాబాద్ పోలీస్ స్టేషన్ — ఉత్తమ సేవా పతకం.
2.నాగేశ్వరరావు, కమ్యూనికేషన్ ఎస్ఐ — సేవా పతకం
3.భూక్య లత, హెడ్ కానిస్టేబుల్ – ఇల్లంతకుంట పోలీస్ స్టేషన్ — సేవా పతకం.
4.శ్రీనివాస్, బోయినపల్లి పోలీస్ స్టేషన్ — సేవా పతకం.



# ఏబీవీపీ ఆధ్వర్యంలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు..




బలగం టీవీ, ఇల్లంతకుంట,

అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఇల్లంతకుంట శాఖ ఆధ్వర్యంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదుట నిర్వహించిన కార్యక్రమంలో జాతీయ జెండాను ఆవిష్కరించి, జాతీయ గీతాన్ని ఆలపించారు.

ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మంద వంశీకృష్ణ మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం సిద్ధించి 80 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా దేశం కోసం ప్రాణాలను పణంగా పెట్టి పోరాడిన అనేకమంది వీరుల త్యాగాలను స్మరించుకోవాలన్నారు. వారి త్యాగాల ఫలితంగానే నేడు మనం స్వేచ్ఛగా జీవిస్తున్నామని పేర్కొన్నారు. ప్రపంచంలో భారత్‌ను విశ్వగురువు స్థానంలో నిలిపేందుకు ప్రతి పౌరుడు తన వంతు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. దేశవ్యాప్తంగా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ, దేశహితం, దేశ భద్రత కోసం ఎల్లప్పుడూ ముందుండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఏబీవీపీ కార్యదర్శి కాసుపక విష్ణువర్ధన్‌తో పాటు అభిషేక్, రామ్, చరణ్, ప్రసన్న కుమార్, సిద్ధూ, శ్రీ వర్ధన్, సౌమ్య, స్వామి, రమ్య, రవళి, నిశాంత్, ఉదయ్, కిరణ్, కుమార్ తదితరులు, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

# రెడ్డి సంక్షేమ సంఘం నూతన కార్యాలయంలో ఘనంగా జెండా ఆవిష్కరణ..

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:

80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని రాజన్న సిరిసిల్ల జిల్లా రెడ్డి సంక్షేమ సంఘం నూతన కార్యాలయంలో జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సంఘం అధ్యక్షులు గుండారపు కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జాతీయ జెండాను ఆవిష్కరించి స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కోర్ కమిటీ సభ్యులు న్యాలకొండ రాఘవరెడ్డి, ఉపాధ్యక్షులు ఎగుమామిడి కృష్ణారెడ్డి, నరేడ్ల రాఘవరెడ్డి, గుల్లపల్లి నరసింహారెడ్డి, సంయుక్త కార్యదర్శి మంద బాల్రెడ్డి, ఎగ్జిక్యూటివ్ సభ్యులు కంకణాల శ్రీనివాస్ రెడ్డి, కంది భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు. అలాగే రెడ్డి సంక్షేమ సంఘం సీనియర్ నాయకులు ఉప్పల లక్ష్మారెడ్డి, దుంద్ర ఆదిరెడ్డి, పబ్బతి విజయేందర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, నేవూరి పద్మారెడ్డి, నేవూరి జగన్ రెడ్డి, ముత్యాల లింగారెడ్డి, గుండాడి లింగారెడ్డి, పాతూరి సుధీర్తో పాటు సంఘం నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.



# హాకీ ప్రపంచకప్‌లో భారత్ బోణీ!

**తొలి మ్యాచ్‌లో వేల్స్‌పై 3-1తో ఘన విజయం**

**మెరిసిన కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్, సంజయ్**

బలగం టీవీ, హైదరాబాద్

నెదర్లాండ్స్ వేదికగా ప్రారంభమైన ప్రపంచకప్ హాకీ టోర్నీలో భారత పురుషుల జట్టు విజయంతో బోణీ కొట్టింది. పూల్-డిలో భాగంగా శనివారం జరిగిన తమ తొలి మ్యాచ్‌లో భారత్ 3-1 గోల్స్ తేడాతో వేల్స్‌ను చిత్తు చేసింది. భారత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ రెండు గోల్స్‌తో జట్టు విజయంలో కీలక పాత్ర పోషించగా, యువ ఆటగాడు సంజయ్ ఒక గోల్ సాధించి మెరిశాడు.

తొలి క్వార్టర్‌లోనే ధనాధన్ ఆధిపత్యం

ఆట ప్రారంభం నుంచే భారత ఆటగాళ్లు అత్యంత దూకుడు ప్రదర్శించారు. మ్యాచ్ 7వ నిమిషంలో లభించిన పెనాల్టీ కార్నర్‌ను సంజయ్ అద్భుతమైన డ్రాగ్‌ఫ్లిక్‌తో గోల్‌గా మలిచి భారత్‌ను 1-0 ఆధిక్యంలో నిలిపాడు. అదే ఉత్సాహంతో దాడి కొనసాగించిన టీమిండియాకు మరో పెనాల్టీ కార్నర్ లభించగా, కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ మెరుపు షాట్‌తో బంతిని గోల్‌పోస్ట్‌లోకి పంపి ఆధిక్యాన్ని 2-0కు పెంచాడు.

హర్మన్‌ప్రీత్ డబుల్ ధమాకా

రెండో క్వార్టర్‌లో వేల్స్ గట్టి పోటీనివ్వడంతో ఇరు జట్లు గోల్స్ ఏవీ చేయలేకపోయాయి. దీంతో తొలి అర్ధభాగం ముగిసేసరికి భారత్ 2-0తో నిలిచింది. మూడో క్వార్టర్‌లోనూ భారత్ ఆధిక్యం కొనసాగింది. లభించిన పెనాల్టీ కార్నర్‌ను హర్మన్‌ప్రీత్ మళ్లీ గోల్‌గా మలిచి జట్టుకు 3-0తో తిరుగులేని ఆధిక్యాన్ని అందించాడు. చివరి క్వార్టర్‌లో వేల్స్ ఆటగాడు సామ్ వెల్ష్ ఒక గోల్ సాధించి లోటును 1-3కి తగ్గించినప్పటికీ, ఫలితంలో ఎలాంటి మార్పు రాలేదు.



ఆగస్టు 17న ఇంగ్లాండ్‌తో పోరు

ఈ మ్యాచ్‌లో లభించిన 5 పెనాల్టీ కార్నర్లలో మూడింటిని గోల్స్‌గా మలచడం భారత్ పెనాల్టీ కార్నర్ సామర్థ్యాన్ని చాటిచెప్పింది. గోల్‌కీపర్ మోహిత్ డిఫెన్స్‌లో అద్భుతమైన సేవ్స్‌తో ఆకట్టుకున్నాడు. 1975 తర్వాత మళ్లీ పసిడి పతకం లక్ష్యంగా బరిలోకి దిగిన భారత జట్టు, తమ తదుపరి మ్యాచ్‌లో ఆగస్టు 17న ఇంగ్లాండ్‌తో, ఆగస్టు 19న చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో తలపడనుంది.

# దేవదత్ పడిక్కల్ శతక గర్జన!



**లంకతో తొలి టెస్టులో భారత్ భారీ స్కోరు**

**తొలి రోజు ముగిసే సమయానికి 288/2..**

**అజేయ శతకంతో మెరిసిన పడిక్కల్**

బలగం టీవీ, హైదరాబాద్

రెండేండ్ల సుదీర్ఘ విరామం తర్వాత భారత టెస్టు జట్టులోకి రీ-ఎంట్రీ ఇచ్చిన యువ బ్యాటర్ దేవదత్ పడిక్కల్ (178 బంతుల్లో 131 బ్యాటింగ్; 12 ఫోర్లు, 1 సిక్స్) అద్భుత శతకంతో చెలరేగాడు. తన అంతర్జాతీయ కెరీర్‌లో తొలి సెంచరీ సాధించి మూడో స్థానానికి తనే సరైన న్యాయం చేయగలనని నిరూపించుకున్నాడు. పడిక్కల్ శతకంతో పాటు సీనియర్ బ్యాటర్ కేఎల్ రాహుల్ (77 రిటైర్డ్ హర్ట్) అర్ధశతకంతో రాణించడంతో శ్రీలంకతో శనివారం ప్రారంభమైన మొదటి టెస్టులో భారత్ తొలి రోజు ఆట ముగిసే సమయానికి 73 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 288 పరుగులు చేసి సుదృఢ స్థితిలో నిలిచింది.

దూకుడుగా ప్రారంభించి.. రనౌటైన జైస్వాల్

టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత్‌కు ఓపెనర్లు యశస్వి జైస్వాల్ (32), కేఎల్ రాహుల్ మంచి ఆరంభాన్ని అందించారు. అయితే ధాటిగా ఆడుతున్న జైస్వాల్, పరుగు తీసే క్రమంలో బౌలర్‌ను ఢీకొని రాహుల్‌తో సమన్వయ లోపంతో రనౌట్‌గా వెనుదిరిగాడు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన పడిక్కల్, లంక బౌలర్లపై తొలి క్షణం నుంచే ఆధిపత్యం చెలాయించాడు. ప్రభాత్ జయసూర్య, లహిరు కుమార బౌలింగ్‌లలో కవర్ డ్రైవ్‌లు, భారీ సిక్సర్లతో విరుచుకుపడ్డాడు.

వర్షం వచ్చినా చెదరని ఏకాగ్రత

వర్షం పలుమార్లు ఆటకు అంతరాయం కలిగించినప్పటికీ పడిక్కల్ ఏకాగ్రత దెబ్బతినలేదు. 81 బంతుల్లోనే అర్ధశతకం పూర్తి చేసుకున్న అతను, ఆ తర్వాత మరింత ధాటిగా ఆడి లహిరు కుమార బౌలింగ్‌లో సింగిల్ తీసి శతక మైలురాయిని చేరుకున్నాడు. రాహుల్ తొడ కండరాలు పట్టేయడంతో 77 పరుగుల వద్ద రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరగగా, కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (16) త్వరగానే ఔటయ్యాడు. ప్రస్తుతం క్రీజులో పడిక్కల్‌తో పాటు రిషబ్ పంత్ (27 బ్యాటింగ్) ఉన్నాడు. లంక బౌలర్లలో ప్రభాత్ జయసూర్యకు ఒక వికెట్ దక్కింది.

భారత్ చారిత్రక మైలురాయి: 600వ టెస్టు మ్యాచ్!

ఈ మ్యాచ్ భారత క్రికెట్ చరిత్రలో ఒక ప్రత్యేక మైలురాయిగా నిలిచింది. అంతర్జాతీయ టెస్టు క్రికెట్‌లో భారత్‌కు ఇది 600వ మ్యాచ్ కావడం విశేషం. ప్రపంచంలో అత్యధిక టెస్టు మ్యాచ్‌లు ఆడిన జట్ల జాబితాలో ఇంగ్లాండ్ (1097), ఆస్ట్రేలియా (883) తర్వాత స్థానంలో నిలిచి భారత్ రికార్డు సృష్టించింది.

సంక్షిప్త స్కోర్లు:

భారత్ తొలి ఇన్నింగ్స్: 73 ఓవర్లలో 288/2 (దేవదత్ పడిక్కల్ 131 బ్యాటింగ్, కేఎల్ రాహుల్ 77, రిషబ్ పంత్ 27 బ్యాటింగ్; ప్రభాత్ జయసూర్య 1/78).

# దేశప్రజలకు క్రీడా ప్రముఖుల శుభాకాంక్షలు!

బలగం టీవీ, హైదరాబాద్

దేశవ్యాప్తంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు అంబరాన్నంటాయి. ఈ సందర్భంగా పలువురు క్రీడా ప్రముఖులు దేశప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. టీమ్‌ఇండియా స్టార్ క్రికెటర్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మలతో పాటు ఐసీసీ ఛైర్మన్ జై షా సోషల్ మీడియా వేదికగా ప్రత్యేక సందేశాలను పంచుకున్నారు.

నెటిజన్లను ఆకట్టుకున్న కోహ్లీ పోస్ట్

స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో షేర్ చేసిన పోస్ట్ నెటిజన్లను విశేషంగా ఆకట్టుకుంటోంది. "అందరికీ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు. మనల్ని ఏకం చేసే స్వేచ్ఛను, మనకు గుర్తింపునిచ్చే వైవిధ్యాన్ని, మనల్ని ముందుకు నడిపించే కలలను ఒక వేడుకలా జరుపుకుందాం. తరతరాలకు స్ఫూర్తినిచ్చే భారతదేశాన్ని మనం నిర్మిస్తూనే ఉండాలి. జై హింద్" అంటూ విరాట్ రాసుకొచ్చిన భావోద్వేగ పూరిత మాటలు అభిమానుల్లో తీవ్ర స్ఫూర్తిని నింపుతున్నాయి.

గర్వంగా ఉందన్న రోహిత్ శర్మ

జట్టు కెప్టెన్ రోహిత్ శర్మ సైతం ప్రత్యేక పోస్ట్‌తో ఆకట్టుకున్నాడు. భారత జెర్సీలో ఉన్న తన ఫోటోను 'బ్లాక్ అండ్ వైట్' ఫిల్టర్‌లో ఎడిట్ చేసి, అందులో జాతీయ జెండా రంగులు మాత్రమే స్పష్టంగా కనిపించేలా రూపకల్పన చేశాడు. "భారత్‌కు ప్రాతినిధ్యం వహించడం ఎల్లప్పుడూ గర్వంగా ఉంటుంది. అందరికీ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు" అని రోహిత్ పోస్ట్ చేశాడు.

ఐసీసీ ఛైర్మన్ జై షా శుభాకాంక్షలు




ఐసీసీ ఛైర్మన్ జై షా 'ఎక్స్' (X) వేదికగా స్పందిస్తూ.. "ఒక దేశం నిజమైన బలం కేవలం దాని విజయాలలోనే కాకుండా, ప్రజలను ఏకం చేసే విలువలలో కూడా ఉంటుంది. అందరికీ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు" అని సందేశాన్ని పంచుకున్నారు.



## ఆస్ట్రేలియాపై బంగ్లాదేశ్ చారిత్రక విజయం దిశగా!

**మూడో రోజు ముగిసే సమయానికి ఆసీస్ 161/4.. ఇంకా 67 పరుగుల వెనుకంజ**

**మెరిసిన మెహదీ హసన్, హసన్ మహ్మూద్**

బలగం టీవీ, హైదరాబాద్

ఆస్ట్రేలియా గడ్డపై తొలిసారి టెస్టు మ్యాచ్ గెలిచి సరికొత్త చరిత్ర సృష్టించేందుకు బంగ్లాదేశ్ చేరువైంది. శనివారం మూడో రోజు ఆట ముగిసే సమయానికి ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్‌లో 53 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 161 పరుగులు చేసి పీకల్లోతు కష్టాల్లో పడింది. ప్రస్తుతం అరంగేట్రంలో ఆసీస్ ఇంకా 67 పరుగుల వెనుకంజలోనే ఉండటంతో, మ్యాచ్‌లో బంగ్లాదేశ్ విజయావకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి.

తొలి ఇన్నింగ్స్‌లో బంగ్లాదేశ్ 426 ఆలౌట్

ఓవర్‌నైట్ స్కోరు 351/6తో మూడో రోజు ఆటను ప్రారంభించిన బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్‌లో 426 పరుగుల భారీ స్కోరు సాధించి ఆలౌటైంది. దీనితో బంగ్లాకు ఏకంగా 228 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది. ఓవర్‌నైట్ బ్యాటర్ తంజిద్ (101) శతకం సాధించి నిష్క్రమించినా, టెయిలెండర్లతో కలిసి మెహదీ హసన్ మిరాజ్ (65) బాధ్యతాయుతమైన హాఫ్ సెంచరీతో జట్టుకు విలువైన పరుగులు అందించాడు. ఆస్ట్రేలియా పేసర్ జోష్ హేజిల్‌వుడ్ 89 పరుగులిచ్చి 6 వికెట్లు పడగొట్టి, తన టెస్టు కెరీర్‌లో 300 వికెట్ల మైలురాయిని చేరుకున్నాడు.

కష్టాల్లో ఆసీస్ టాప్ ఆర్డర్

228 పరుగుల భారీ ఇన్నింగ్స్ లోటుతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆస్ట్రేలియాను బంగ్లా పేసర్ హసన్ మహ్మూద్ (2/33) ప్రారంభంలోనే కోలుకోలేని దెబ్బ తీశాడు. ఓపెనర్లు వెదరాల్డ్ (0), ట్రావిస్ హెడ్ (17)లను త్వరగానే పెవిలియన్ చేర్చడంతో ఆసీస్ 37/2తో తీవ్ర ఒత్తిడిలో పడింది. ఆ తర్వాత మార్నస్ లబుషేన్ (31)ను తైజుల్ ఇస్లాం (1/28) బౌల్డ్ చేయగా, స్టీవ్ స్మిత్ (44)ను మెహదీ హసన్ మిరాజ్ అద్భుతమైన రిటర్న్ క్యాచ్‌తో ఔట్ చేశాడు.

ప్రస్తుతం క్రీజులో కెమెరాన్ గ్రీన్ (43 బ్యాటింగ్), వికెట్ కీపర్ అలెక్స్ కేరీ (19 బ్యాటింగ్) ఉన్నారు. ఇంకా రెండు రోజుల ఆట మిగిలి ఉన్న ఈ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా ఓటమి నుంచి తప్పించుకోవాలంటే నాలుగో రోజు అద్భుతం చేయాల్సిందే.

సంక్షిప్త స్కోర్లు:

బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్: 426 ఆలౌట్ (తంజిద్ 101, మెహదీ హసన్ మిరాజ్ 65; జోష్ హేజిల్‌వుడ్ 6/89).

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: 198 ఆలౌట్.

ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్ (మూడో రోజు ముగిసే సమయానికి): 53 ఓవర్లలో 161/4 (స్టీవ్ స్మిత్ 44, కెమెరాన్ గ్రీన్ 43 బ్యాటింగ్; హసన్ మహ్మూద్ 2/33).



## సైకిల్ ట్రాక్‌పై విషాదం

**ప్రమాదంలో 19 ఏళ్ల సైక్లిస్ట్ ఫిన్లే టార్లింగ్ మృతి!**

**వొల్టా ఏ పోర్చుగల్ ఈవెంట్‌లో ఘోరం.. వ్యతిరేక దిశలో వచ్చి ఢీకొట్టిన ట్రక్**

**ప్రతిభావంతుడైన సైక్లిస్ట్ మృతి పట్ల క్రీడా ప్రపంచం దిగ్భ్రాంతి**

బలగం టీవీ, హైదరాబాద్

సైకిల్ ట్రాక్‌పై జరిగిన ఒక ఘోర రోడ్డు ప్రమాదం ఉజ్వల భవిష్యత్తు ఉన్న యువ సైక్లిస్ట్‌ను పొట్టనబెట్టుకుంది. 'వొల్టా ఏ పోర్చుగల్' (Volta a Portugal) సైక్లింగ్ టోర్నీలో పాల్గొన్న బ్రిటన్‌కు చెందిన 19 ఏళ్ల ఫిన్లే టార్లింగ్ (Finlay Tarling) దుర్మరణం చెందాడు. శనివారం జరిగిన ఈ విషాదకర ఘటన క్రీడా లోకాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది.

వ్యతిరేక దిశలో దూసుకొచ్చిన ట్రక్

వొల్టా ఏ పోర్చుగల్ ఈవెంట్‌లో ఎనిమిదో దశ పోటీలు జరుగుతుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఫిన్లే టార్లింగ్ ట్రాక్‌పై దూసుకెళ్తున్న సమయంలో, హఠాత్తుగా ఒక వాహనం (ట్రక్) వ్యతిరేక దిశలో ట్రాక్ మీదికి దూసుకొచ్చి అతడిని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తలకు తీవ్రమైన గాయాలు కావడంతో ఫిన్లే అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. ఘటన వెంటనే నిర్వాహకులు పోటీని నిలిపివేశారు.

కన్నీటిపర్యంతమైన ఎన్ఎస్ఎన్ టీమ్

చిన్న వయసులోనే టైమ్ ట్రయల్స్ (Time Trials) విభాగంలో అద్భుత ప్రతిభ చూపి ఆరితేరిన ఫిన్లే మృతి పట్ల అతడు ప్రాతినిధ్యం వహిస్తున్న 'ఎన్ఎస్ఎన్ డెవలప్‌మెంట్ టీమ్' (NSN Development Team) ఆవేదన వ్యక్తం చేసింది. "మా జట్టులో ఎంతో ప్రియమైన సభ్యుడు ఫిన్లే మరణించాడనే విషయాన్ని బద్ధలైన హృదయంతో తెలియజేస్తున్నాం. అతడు మాలో చాలామందికి కొడుకులాంటివాడు, సోదరుడు మరియు మంచి స్నేహితుడు. అతడిని మేమెంతో మిస్సవుతాం" అని ప్రకటన విడుదల చేసింది.

ఫిన్లే టార్లింగ్ మృతి పట్ల టోర్నీ నిర్వాహకులు, పోర్చుగీస్ సైక్లింగ్ సమాఖ్యతో పాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న సైక్లింగ్ దిగ్గజాలు, క్రీడాకారులు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.



## జైస్వాల్ రనౌట్‌పై వివాదం.. బౌలర్ తప్పిదం కాదన్న సంజయ్ మంజ్రేకర్!

**'అలసత్వంతోనే మూల్యం చెల్లించుకున్నాడు'.. కామెంటేటర్ ఆసక్తికర వ్యాఖ్యలు**

**శ్రీలంకతో తొలి టెస్టులో అనూహ్య రనౌట్**

బలగం టీవీ, హైదరాబాద్

శ్రీలంకతో శనివారం ప్రారంభమైన తొలి టెస్టులో భారత ఓపెనర్ యశస్వి జైస్వాల్ రనౌట్ కావడం తీవ్ర వివాదాస్పదంగా మారింది. శ్రీలంక అరంగేట్ర బౌలర్ కేశర నువంత అడ్డుపడటంతో కిందపడిపోయిన జైస్వాల్ రనౌట్‌గా వెనుదిరగాల్సి వచ్చింది. లంక బౌలర్ క్రీడా స్ఫూర్తికి విరుద్ధంగా వ్యవహరించడం వల్లే జైస్వాల్ ఔటయ్యాడని భారత అభిమానులు ఆరోపిస్తూ సోషల్ మీడియాలో మండిపడుతున్నారు.

అసలేం జరిగింది?

భారత ఇన్నింగ్స్ 11వ ఓవర్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. కేశర నువంత వేసిన ఆఖరి బంతిని నాన్‌స్ట్రైకర్‌గా ఉన్న కేఎల్ రాహుల్ మిడాన్ దిశగా ఆడి సింగిల్ కోసం పరుగెత్తాడు. అయితే బంతిని ఆపే క్రమంలో బౌలర్ కేశర డైవ్ చేయడంతో, అతనికి అడ్డుగా వచ్చిన జైస్వాల్ బ్యాలెన్స్ కోల్పోయి కిందపడిపోయాడు. అప్పటికే సగం క్రీజు దాటిన రాహుల్ ఆగిపోగా, జైస్వాల్ లేచి పరుగెత్తేందుకు ప్రయత్నించి మళ్లీ యూటర్న్ తీసుకుని నాన్‌స్ట్రైకర్ వైపే వెళ్లాడు. ఈ క్రమంలో బంతిని అందుకున్న ప్రభాత్, కీపర్ నిరోషన్ డిక్‌వెల్లాకు అందించడంతో జైస్వాల్ రనౌటయ్యాడు.

జైస్వాల్ నిర్లక్ష్యమే కారణం: మంజ్రేకర్

ఈ రనౌట్‌పై మాజీ క్రికెటర్, ప్రముఖ కామెంటేటర్ సంజయ్ మంజ్రేకర్ భిన్నంగా స్పందించారు. ఈ ఘటనలో శ్రీలంక బౌలర్ గానీ, కేఎల్ రాహుల్ గానీ ఎలాంటి తప్పిదం చేయలేదని ఆయన అభిప్రాయపడ్డారు. "అది కచ్చితంగా సింగిల్ వస్తుందని నేను అనుకుంటున్నా. రాహుల్ సునాయాసంగా క్రీజులోకి చేరుకునేవాడు. కానీ జైస్వాల్ తన లోకంలో తాను ఉంటూ నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లనే అలసత్వానికి మూల్యం చెల్లించుకున్నాడు" అని మంజ్రేకర్ జైస్వాల్‌ను తప్పుబట్టారు.



## 2036 ఒలింపిక్స్ రేసులో భారత్

**ప్రధాని నరేంద్ర మోదీ!**

**5 నుంచి 15 ఏళ్ల పిల్లల కోసం దేశవ్యాప్త ప్రతిభాన్వేషణ (టాలెంట్ హంట్)**

**80వ స్వాతంత్ర్య దినోత్సవ వేదికగా ఎర్రకోట నుంచి కీలక ప్రకటన**

బలగం టీవీ, హైదరాబాద్

2036 ఒలింపిక్స్ క్రీడలకు ఆతిథ్యం ఇచ్చేందుకు భారతదేశం అత్యంత బలమైన పోటీదారుగా నిలిచిందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. శనివారం 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ఢిల్లీలోని ఎర్రకోట వద్ద జాతీయ జెండాను ఎగురవేసిన అనంతరం ఆయన దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. అంతర్జాతీయ క్రీడా ప్రపంచంలో భారత్ తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకుంటూ వేగంగా ముందుకు దూసుకెళ్తోందని మోదీ కొనియాడారు.

చిన్నారుల కోసం ప్రత్యేక ప్రతిభాన్వేషణ

భవిష్యత్తులో జరిగే ఒలింపిక్స్ వంటి భారీ క్రీడా ఈవెంట్లలో భారత్ తన బలమైన ఉనికిని చాటుకునేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు ప్రధాని తెలిపారు. ఇందులో భాగంగా 5 నుంచి 15 ఏళ్ల వయస్సు గల పిల్లలలోని క్రీడా ప్రతిభను గుర్తించేందుకు దేశవ్యాప్తంగా గ్రామీణ స్థాయిలో ఒక ప్రత్యేక అన్వేషణ కార్యక్రమాన్ని (టాలెంట్ హంట్) ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. అలా ఎంపిక చేసిన ప్రతిభావంతులకు ప్రపంచ స్థాయి అథ్లెట్లుగా ఎదిగేందుకు ప్రత్యేక శిక్షణ ఇప్పిస్తామని వెల్లడించారు.

2036 నాటికి 75 శాతం ఈవెంట్లలో పోటీయే లక్ష్యం

"ఒలింపిక్స్‌లో దాదాపు 40 క్రీడాంశాలు, 350 ఈవెంట్లు ఉంటాయి. ఇప్పటివరకు కనీసం మూడింట రెండొంతుల ఈవెంట్లలో కూడా మన అథ్లెట్లు పోటీ పడలేకపోవడం విచారకరం. అయితే 2036 ఒలింపిక్స్ నాటికి కనీసం నాలుగింట మూడు వంతుల (75 శాతం) ఈవెంట్లలో భారత్ తరపున అథ్లెట్లు పోటీపడేలా తీర్చిదిద్దడమే మన లక్ష్యం" అని ప్రధాని ఉద్ఘాటించారు.

క్రీడారంగానికి 'టాప్స్', 'ఖేలో ఇండియా' ఊతం

'టార్గెట్ ఒలింపిక్ పోడియం స్కీమ్' (TOPS), ఖేలో ఇండియా గేమ్స్, యూనివర్సిటీ గేమ్స్, వింటర్ గేమ్స్ మరియు స్పోర్ట్స్ మెడిసిన్ వంటి వినూత్న కార్యక్రమాలు దేశంలో క్రీడారంగానికి ఊతమిచ్చాయని మోదీ పేర్కొన్నారు. కాగా, 2030 కామన్వెల్త్ క్రీడలకు భారత్‌లోని అహ్మదాబాద్ నగరం ఆతిథ్యం ఇవ్వనుందని ప్రధాని గుర్తుచేశారు



## రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగిన కేఎల్ రాహుల్!

**శ్రీలంకతో తొలి టెస్టు: హాఫ్ సెంచరీ తర్వాత మైదానాన్ని వీడిన ఓపెనర్**

బలగం టీవీ, హైదరాబాద్

శ్రీలంకతో శనివారం ప్రారంభమైన తొలి టెస్టు మ్యాచ్‌లో భారత సీనియర్ ఓపెనర్ కేఎల్ రాహుల్ అనూహ్యంగా మైదానాన్ని వీడాడు. అద్భుతమైన బ్యాటింగ్‌తో శతకం దిశగా సాగుతున్న సమయంలో కండరాలు పట్టేయడంతో అతను రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరగాల్సి వచ్చింది.

సాధికారిక బ్యాటింగ్‌తో హాఫ్ సెంచరీ

టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న టీమిండియా తరపున ఓపెనర్‌గా బరిలోకి దిగిన రాహుల్, ప్రారంభం నుంచే తన అనుభవంతో సాధికారికంగా ఆడాడు. భాగస్వామి యశస్వి జైస్వాల్ (32) రనౌట్‌గా వెనుదిరిగినప్పటికీ, యువ బ్యాటర్ దేవదత్ పడిక్కల్‌తో కలిసి ఇన్నింగ్స్‌ను నిలబెట్టాడు. ఒకవైపు తాను పరుగులు చేస్తూనే, మరోవైపు పడిక్కల్‌కు మార్గదర్శిగా నిలిచి ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. ఈ క్రమంలో రాహుల్ 127 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకోగా, టీమిండియా 197/1 స్కోరుతో టీ బ్రేక్‌కు వెళ్లింది.

కండరాలు పట్టేయడంతో వెనుకంజ

అయితే ఆఖరి సెషన్ ప్రారంభానికి ముందు మైదానంలోకి వచ్చేందుకు సిద్ధమైన రాహుల్‌కు చేతి మరియు కాలి కండరాలు పట్టేయడంతో తీవ్ర ఇబ్బంది ఎదురైంది. ఫిజియోల సాయంతో మైదానంలోకి అడుగుపెట్టేందుకు ప్రయత్నించినప్పటికీ సాధ్యపడకపోవడంతో అతను రిటైర్డ్ హర్ట్‌గా క్రీజును వీడాడు. రాహుల్ స్థానంలో కెప్టెన్ శుభ్‌మన్ గిల్ క్రీజులోకి వచ్చాడు.

మరోవైపు అద్భుత ఫామ్‌ను కొనసాగించిన దేవదత్ పడిక్కల్ 134 బంతుల్లోనే సెంచరీ పూర్తి చేసుకుని జట్టును సుదృఢ స్థితిలో నిలిపాడు.